# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
23-4-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 36

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## హైకోర్టులో కేసీఆర్ కు ఊరట

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక నిలిపివేత

విచారణలో నిబంధనలు పాటించలేదన్న ధర్మాసనం

ఏం చేయాలన్న దానిపై రేవంత్ సర్కారు సమాలోచనలు

కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల వైఫల్యం, అవకతవకలపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ వ్యవహారంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులకు హైకోర్టులో భారీ ఊరట లభించింది.

# కడప వైసీపీలో కోల్డ్ వార్!



అవినాష్ రెడ్డి వర్సెస్ రవీంద్రనాథ్ రెడ్డి

మేనమామను సర్ది చెప్పలేకపోతున్న జగన్

రోజురోజుకు శృతిమిస్తున్న విభేదాలు



కడప జిల్లాలో వైసీపీ నేతల మధ్య కోల్డ్ వార్ జరుగుతోందా? ఎంపీ అవినాష్ రెడ్డి, జగన్ మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి మధ్య విభేదాలు ఉన్నాయా? అవి తారా స్థాయికి చేరుకున్నాయా? జగన్ తీవ్ర ఆలోచనలో పడ్డారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది.

క్రైమ్ మిర్రర్, రాయలసీమ బ్యూరో

- మిగతా 2వ పేజీలో



# మళ్లీ గులాబీ గుభాళింపు

## జగిత్యాల సభతో బీఆర్ఎస్‌లో నూతనోత్సాహం

శ్రేణుల సమక్షంలో మరోసారి గర్జించిన కేసీఆర్

హైకోర్టు తీర్పు అనుకూలంగా రావడంతో సంతోషం

ఇక పార్టీ సంస్థాగత బలోపేతంపై గులాబీ బాస్ దృష్టి

కొత్త-పాత తరం కలయికతో ఇక 2.0 టీమ్

తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్ మరోసారి తన మార్క్ చాటుకోవడానికి సిద్ధమయ్యారు. జగిత్యాల బహిరంగ సభకు వచ్చిన అశేష జనవాహిని చూశాక, పార్టీ క్యాడర్‌లో భరోసా నింపాలంటే సంస్థాగత మార్పులు తప్పనిసరి అని ఆయన గుర్తించారు. ఏప్రిల్ 27న బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం నాటికి పార్టీకి కొత్త రూపునిచ్చే దిశగా అడుగులు వేస్తున్నారు. కేవలం పైస్థాయిలోనే కాకుండా, గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ యంత్రాంగాన్ని యుద్ధ ప్రాతిపదికన సిద్ధం చేయాలని యోచిస్తున్నారు.

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:

'బీఆర్ఎస్ 2.0' ప్లాన్ తో పాత తరం అనుభవం, కొత్త తరం వేగాన్ని కలగలిపి కేసీఆర్ ఈ కొత్త టీమ్ను రూపొందిస్తున్నారు. అంతేకాకుండా.. ఈసారి కమిటీల ఏర్పాటులో సమతూకం పాటించబోతున్నారు. పార్టీ కోసం మొదటి నుంచి పనిచేసిన సీనియర్ నేతలను కేవలం సలహాదారులకే పరిమితం చేయకుండా, వారికి జిల్లాల వారీగా కీలక బాధ్యతలు అప్పగించనున్నారు. జీవన్ రెడ్డి వంటి నేతల చేరికతో సీనియర్ల విభాగాన్ని మరింత బలోపేతం చేస్తున్నారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ, ప్రభుత్వ వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకెళ్లగల యువ నేతలకు, మహిళా నాయకులకు ఈసారి కమిటీల్లో 33 శాతం నుంచి 50 శాతం వరకు చోటు కల్పించబోతున్నట్లు సమాచారం.

- మిగతా 2వ పేజీలో



## దావోస్, గ్లోబల్ సమ్మిట్ పెట్టుబడులపై ఆరా

ఎంవోయూలు కుదుర్చుకున్న కంపెనీలకు భూ కేటాయింపులు

ప్రముఖ కంపెనీలకు తొలి వెడతలో భూములు

అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ సూచన

హైదరాబాద్,(క్రైమ్ మిర్రర్): ఎంఓయూలు కుదుర్చుకున్న కంపెనీలకు వివిధ ప్రాంతాల్లో కేటాయించాల్సిన భూములకు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కంపెనీలకు కల్పించాల్సిన సౌకర్యాలు, భవిష్యత్ అవసరాలకు సంబంధించి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. పెట్టుబడులకు సంబంధించి దావోస్, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో

2లో

# తమిళనాడులో నేడు ఒకే విడతలో పోలింగ్

234 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో ఎన్నికలు

పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం

బెంగాల్లో 152 స్థానాలకు తొలి విడల పోలింగ్ ఏర్పాట్లు

న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్): తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. అలాగే బెంగాల్లో తొలిదశ పోలింగ్ జరుగనుంది. ఈ రెండు రాష్ట్రాల్లో ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం పటిష్ట ఏర్పాట్లు చేసింది. ఎన్నికల సిబ్బంది సరంజామాతో



మిగతా 2వ పేజీలో



## హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు

పీసీ ఘోష్ కమిషన్ కాదు.. ముమ్మాటికీ పీసీసీ నివేదిక

రాజకీయ కుట్రలు పక్కన పెట్టి రైతన్నల కోసం పనిచేయండి

హైకోర్టు తీర్పుపై మిడియాతో కెటిఆర్



## కాళేశ్వరంపై సీబీఐ విచారణకు సిద్ధమా

నిజాయితీ ఉంటే ముందుకు రండి

బీఆర్ఎస్ నాయకత్వానికి మంత్రి పొంగులేటి సవాల్

## మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు మృతి

పట్ల చంద్రబాబు సంతాపం

నాదెండ్ల మనోహర్‌ను ఫోన్‌లో పరామర్శించిన ముఖ్యమంత్రి


కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేసిన చంద్రబాబు

ఉదయం హైదరాబాద్‌లో తుది శ్వాస విడిచిన భాస్కరరావు



మాజీ సీఎం నాదెండ్ల భాస్కర రావు మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంతాపం తెలియజేశారు. నాదెండ్ల భాస్కరరావు తనయుడు, కేబినెట్ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ముఖ్యమంత్రి ఫోన్ చేసి పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు తన సానుభూతి

3లో



రూ.5,400 కోట్ల పెట్టుబడులతో

# రెన్యూ ఎనర్జీ గ్లోబల్

అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో ఎనర్జీ ప్లాంట్

నేడు శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

# హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): కూలింది.. కాళేశ్వరం కాదని, కాంగ్రెస్ చేసిన కుట్రలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికపై బుధవారం హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. హైకోర్టు తీర్పు కాంగ్రెస్ కుట్రలకు చెంపపెట్టు అని కేటీఆర్ అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కార్ రాజకీయ కుట్రలు పక్కన పెట్టి రైతన్నల కోసం పని చేయాలని హితవు పలికారు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదు, ముమ్మాటికీ పీసీసీ నివేదిక అని మేము ముందు నుంచి చెబుతుంది ఇవాళ అక్షరాల నిజమని తేలిపోయిందన్నారు.. కేసీఆర్‌పై దుష్ప్రచారం చేసిన వారి చెంప చెళ్లుమనించే విధంగా హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఇవాళ గెలిచింది.. తెలంగాణ ప్రజలు, రైతులు, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కృషి చేసిన ఇంజినీర్లు. మూడేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంపై దుష్ప్రచారం చేసింది. ఇవాళ తెలంగాణలో పారుతున్న ప్రతినీటి బొట్టు కేసీఆర్ కృషే. భూమిపై గోదావరి పారినన్ని రోజులూ కేసీఆర్ చరిత్రను ఎవరూ చెరిపివేయలేరు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదు, పీసీసీ నివేదిక అని నేను అప్పుడే చెప్పాను. హైకోర్టు తీర్పుతో అందరికీ ఇవాళ జ్ఞానోదయం కలిగి ఉంటుంది. కాళేశ్వరం కచ్చితంగా తెలంగాణకు వరప్రదాయని. రూ.94వేల కోట్లు ఖర్చు అయితే.. రూ.లక్ష కోట్లు అని దుష్ప్రచారం చేశారు. కాళేశ్వరం అంటే ఒక్క బ్యారేజీ కాదు.. మూడు బ్యారేజీలు. మేడిగడ్డపై చేసిన ఖర్చు రూ.3,800 కోట్లు మాత్రమే. కాంగ్రెస్ కుట్రల వల్లే మేడిగడ్డ బ్యారేజీ కుంగిందని మరోసారి చెబుతున్నా. రాష్ట్రంలో చెక్‌డ్యామ్‌లను బాంబులు పెట్టి పేలుస్తున్నారు. ఈ విషయంలో కేంద్రం ఏం చేస్తోంది? మేడిగడ్డలో ఏం జరిగిందో విశ్రాంత జడ్జితో మళ్లీ విచారణ జరిపించాలని కేటీఆర్ అన్నారు.తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షగట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టు తీర్పు ఒక గట్టి 'చెంపపెట్టు' అని కేటీఆర్ అభివర్ణించారు. భారత రాజ్యాంగానికి, చట్టాలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా దేశంలోని గౌరవ న్యాయస్థానాలు చూస్తూ ఊరుకోవని ఈ తీర్పుతో మరోసారి రుజువైందని కేటీఆర్ పేర్కొన్నారు. ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేయడంతో రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ కుట్రలకు బ్రేక్ పడినట్లయిందని కేటీఆర్ స్పష్టం చేశారు. కమిషన్ విచారణలో సహజ న్యాయ సూత్రాలను పూర్తిగా విస్మరించడమే కాకుండా, నిబంధనలకు పాతరేశారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గతంలోనే స్పష్టం చేశారని, ఆ విషయాలతో ఇవాళ హైకోర్టు కూడా ఏకీభవించడం హర్షణీయమని ఆయన తెలిపారు. రాజకీయ కక్ష సాధింపు కోసం వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్న తీరును ఈ తీర్పు ఎండగట్టిందని ఆయన అభిప్రాయపడ్డారు. రెండున్నరేళ్లుగా కల్పతరువు లాంటి కాళేశ్వరం ప్రాజెక్టును పడావు పెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా ముక్కు నేలకు రాసి, రాష్ట్రంలోని అన్నదాతలకు క్షమాపణలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే మేడిగడ్డ బ్యారేజీలో స్వల్పంగా దెబ్బతిన్న రెండు పిల్లర్లను రిపేర్ చేసి, రాష్ట్రంలోని లక్షలాది మంది రైతుల సాగునీటి కష్టాలు తీర్చాలని సూచించారు. రాజకీయ క్రీడ కంటే రైతుల ప్రయోజనాలే ముఖ్యమని కేటీఆర్ హితవు పలికారు.గోదావరి జలాలను పక్కరాష్ట్రానికి దోచిపెట్టి, తెలంగాణలో వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టే కుతంత్రాలను ఇంకా కొనసాగించాలని చూస్తే రేవంత్ సర్కారుకు రైతుల చేతిలోవాతలు తప్పవని కేటీఆర్ హెచ్చరించారు. ప్రాజెక్టుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ, రైతుల పొలాలకు నీరు అందకుండా చేస్తున్న ప్రభుత్వ వైఖరిని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# కాళేశ్వరంపై సీబీఐ విచారణకు సిద్ధమా

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): కాళేశ్వరం ప్రాజెక్ట్ లో ఎలాంటి అవినీతి జరగలేదని పదే పదే చెబుతున్న బీఆర్ఎస్ నాయకులు నిజంగా నిర్దోషులైతే, వెంటనే స్వయంగా సీబీఐ విచారణకు డిమాండ్ చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సవాల్ విసిరారు. కాళేశ్వరం అంశంపై హైకోర్టు 'క్లీన్ చీట్' ఇచ్చిందని తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని మంత్రి తీవ్రంగా విమర్శించారు. నిజంగా ఎలాంటి అవకతవకలు జరగలేదంటే, స్వతంత్ర సంస్థ ద్వారా విచారణకు ఎందుకు వెనుకంజ వేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విచారణ జరిగితే అసలు నిజాలు వెలుగులోకి వస్తాయనే భయంతోనే బీఆర్ఎస్ నాయకత్వం వెనుకడుగు వేస్తోందని, భారీ ఆర్థిక దోపిడీ, కమీషన్ల వ్యవహారం, కాంట్రాక్టుల లోపాలు అన్నీ బహిర్గతమవుతాయనే భయమే వారిని వెంటాడుతోందని మంత్రి అన్నారు. ఇదే భయంతో బీజేపీతో చీకటి ఒప్పందాలు కుదుర్చుకుని, విచారణను తప్పించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఒక ప్రకటనలో ఆరోపించారు. వేల కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ నాణ్యతపై ఇప్పటికే తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, మేడిగడ్డ వంటి కీలక నిర్మాణాలు కుంగిపోవడం, పంప్ హౌజ్‌లు దెబ్బతినడం వంటి సంఘటనలు యాదృచ్ఛికం కాదని స్పష్టం చేశారు. ఇవన్నీ ప్రాజెక్టులో జరిగిన పెద్ద ఎత్తున అవినీతికి నిదర్శనాలేనని పేర్కొన్నారు. నాటి టీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాల కారణంగానే కాళేశ్వరం ప్రాజెక్ట్ నాణ్యత దెబ్బతిందని, అదే విధంగా నిర్మించిన చెక్ డ్యాములు కూడా కుప్పకూలిన ఘటనలు ప్రజల ముందు ఉన్న వాస్తవాలేనని మంత్రి గుర్తు చేశారు.లక్ష కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ ప్రాజెక్ట్‌లో ఎలాంటి అవినీతి జరగలేదన్నట్టుగా గ్లోబల్ ప్రచారానికి దిగడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని, ఇది టీఆర్ఎస్ పాలనలో పెరిగిన మాయాజాల రాజకీయాలే అని విమర్శించారు. నిజాన్ని దాచేందుకు ప్రచార యంత్రాంగాన్ని వినియోగించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు.

# కడప వైసీపీలో కోల్డ్ వార్!

జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. ఇప్పటికే కుటుంబ విభేదాలతో జగన్మోహన్ రెడ్డి సతమతం అవుతున్నారు. అందుకే ఈ విషయంలో ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. మామ రవీంద్రనాథ్ రెడ్డి విషయంలో చర్యలు తీసుకుంటే ఆయన పార్టీకి గుడ్ బై చెబుతారన్న భయం వెంటాడుతోంది. అన్నింటికీ మించి ఆయన తన తల్లి విజయమ్మ, చెల్లెలు షర్మిళ చెంతకు చేరితే తనకు ఇబ్బందులు వస్తాయని జగన్ తీవ్రంగా భయపడుతున్నట్లు సమాచారం.



**కొత్తగా గ్రూపులు..**

గత కొద్దిరోజులుగా కడప ఎంపీ అవినాష్ రెడ్డి తో రవీంద్రనాథ్ రెడ్డి తీవ్రంగా విభేదిస్తున్నారు. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే గ్రూపులు తయారయ్యాయి. ఆ విషయం జగన్మోహన్ రెడ్డికి తెలిసిన ఆయన పెద్దగా పట్టించుకోవడం లేదు. కానీ పరిస్థితి చూస్తుంటే మాత్రం రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఈ పరిస్థితుల్లో ఏం చేయాలో తెలియడం లేదు జగన్మోహన్ రెడ్డికి. మరోవైపు మంగళవారం నుంచి మూడు రోజులపాటు పులివెందులలోనే ఉండనున్నారు జగన్మోహన్ రెడ్డి. రవీంద్రనాథ్ రెడ్డి పై ఫిర్యాదు చేసేందుకు అవినాష్ రెడ్డి వర్గం సిద్ధంగా ఉంది. కానీ జగన్మోహన్ రెడ్డి కక్కలేక మింగలేని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. అవినాష్ రెడ్డి తో పోల్చుకుంటే రవీంద్రనాథ్ రెడ్డి తోనే జగన్మోహన్ రెడ్డికి తలనొప్పి. అలాగని ఆయనను వదులుకుంటే నేరుగా షర్మిల తో పాటు విజయమ్మ వద్దకు చేరుతారు. కుటుంబ అసమతి కూడా పెరగనుంది. అందుకే జగన్మోహన్ రెడ్డి సైలెన్స్ పాటిస్తున్నట్లు తెలుస్తోంది.

**మేనమామకు జిల్లా బాధ్యతలు..**

మొన్నటి ఎన్నికల్లో కడప జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దారుణ పరాజయం ఎదురైంది. పది అసెంబ్లీ స్థానాలకు గాను కేవలం మూడు చోట్ల మాత్రమే ఆ పార్టీ గెలిచింది. అత్యంత సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటుంది వైయస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబ. ఇటువంటి క్లిష్ట సమయంలో కడప జిల్లా అధ్యక్ష బాధ్యతలను తన మేనమామ రవీంద్రనాథ్ రెడ్డికి అప్పగించారు జగన్. అయితే రవీంద్రనాథ్ రెడ్డి అందర్నీ కలుపు కెళ్లే మనస్తత్వం కాదు. ఇది పార్టీకి ఇబ్బందికర పరిస్థితులను తెస్తోంది. ప్రధానంగా ఆయన కడప అసెంబ్లీ నియోజకవర్గం పై కన్నేసినట్లు తెలుస్తోంది. కానీ ఆ సీటులో ముస్లిం ప్రాబల్యం ఎక్కువ. అందుకే జగన్మోహన్ రెడ్డి అక్కడ సీటు ఇచ్చేందుకు వీలుపడదని తేల్చి చెప్పారు. అయినా సరే అదేపనిగా కడప అసెంబ్లీ సీటు విషయంలో వేలు పెడుతున్నారు రవీంద్రనాథ్ రెడ్డి. మరోవైపు అక్కడ వైసిపి నేతలుగా ఉన్న మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, మేయర్ సురేష్ బాబు తో రవీంద్రనాథ్ రెడ్డికి పడడం లేదు. వారిద్దరూ కడప ఎంపీ అవినాష్ రెడ్డి తో సన్నిహితంగా ఉంటారు. అది ఎంత మాత్రం రవీంద్రనాథ్ రెడ్డికి రుచించడం లేదు.

## ఎంపీ తో విభేదాలు..

గతంలో కమలాపురం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు రవీంద్రనాథ్ రెడ్డి. మొన్నటి ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు.. ఆ నియోజకవర్గానికి చెందిన వైసిపి నేతలు ఎంపీ అవినాష్ రెడ్డి ని కలుస్తుంటే రవీంద్రనాథ్ రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో అవినాష్ రెడ్డితో తాడోపేడో అన్నట్టు రవీంద్రనాథ్ రెడ్డి ఉన్నారు. దానికి కారణం వైయస్సార్ కుటుంబ వ్యవహారం. తన సోదరి విజయమ్మతో పాటు మేనకోడలు షర్మిల పార్టీకి దూరంగా ఉండడానికి కారణం అవినాష్ రెడ్డి అంటూ బాహటంగానే విమర్శలు చేస్తున్నారు రవీంద్రనాథ్ రెడ్డి. ఈ క్రమంలో అవినాష్ రెడ్డి సైతం రవీంద్రనాథ్ రెడ్డి పై జగన్మోహన్ రెడ్డికి ఫిర్యాదులు చేస్తున్నారు. అవినాష్ రెడ్డి వైపు జగన్మోహన్ రెడ్డికి మొగ్గు ఉంది కానీ.. ఆయనను వదులుకుంటే జరిగే పరిణామాలు జగన్మోహన్ రెడ్డికి తెలుసు. అందుకే ఇద్దరి మధ్య రాజీ చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ రవీంద్రనాథ్ రెడ్డి పట్టించుకోవడంలేదని తెలుస్తోంది. చూడాలి మున్ముందు పరిణామాలు ఎటు దారి తీస్తాయి.

# మళ్లీ గులాబీ గుభాళింపు

**కేటీఆర్, హరీశ్ లకు కీలక బాధ్యతలు..**

పార్టీలో జోడెడ్లలా పనిచేసే కేటీఆర్, హరీశ్రావుకు ఈసారి మరింత కీలకమైన బాధ్యతలను కేసీఆర్ అప్పగించబోతున్నట్లు తెలుస్తోంది. నగర ప్రాంతాల్లో పట్టు పెంచుకోవడం, సోషల్ మీడియా వ్యూహాలు, ఐటీ/పట్టణ ఓటర్లను ఆకర్షించే బాధ్యతలను కేటీఆర్ పర్యవేక్షించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ కేడర్‌ను సమన్వయం చేయడం, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటాలను నడిపించడం, రైతు విభాగాలను బలోపేతం చేయడం హరీష్ రావుకు అప్పగించనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు మేలో భారీ స్థాయిలో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలని కేసీఆర్ నిర్ణయించారు. ఈసారి సభ్యత్వ నమోదును పూర్తిగా డిజిటలైజ్ చేయనుంది. మేలో సభ్యత్వం పూర్తయ్యాక, జూన్ నాటికి గ్రామ కమిటీల నుంచి రాష్ట్ర కమిటీ వరకు వరుసగా నియామకాలు జరగనున్నాయి. దీనివల్ల కింది స్థాయి కార్యకర్తలకు తాము పార్టీలో గుర్తింపు పొందుతున్నామనే భావన కల్పించవచ్చని కేసీఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

**ఆవిర్భావ దినోత్సవాన కీలక ప్రకటనలు..**

బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేసీఆర్ కొన్ని సంచలన నిర్ణయాలు ప్రకటించే అవకాశం ఉందంటున్నారు. ప్రభుత్వంపై నిఘా పెట్టేందుకు, ప్రతి శాఖలోని వైఫల్యాలను ఎండగట్టేందుకు 'షాడో కేబినెట్' తరహాలో నిపుణుల కమిటీలను వేయనున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ అస్తిత్వంతో పాటు, జాతీయ స్థాయిలో బీఆర్ఎస్ పాత్రపై మరింత స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది. జగిత్యాల సభ కేసీఆర్ దిగ్విజయం కావడానికితోడు హైకోర్టులో కాళేశ్వరం కేసులో లభించిన ఊరట కూడా ఆయనకు మరింత బలాన్నిచ్చింది. ఇప్పుడు ఈ కొత్త టీమ్ ద్వారా పార్టీని మళ్లీ గ్రామ స్థాయిలోకి తీసుకెళ్లగలిగితే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# హైకోర్టులో కేసీఆర్ కు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ ప్రక్రియలో సరైన నిబంధనలను పాటించలేదని హైకోర్టు ధర్మాసనం పేర్కొంది. ఈ క్రమంలోనే కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఎలాంటి తదుపరి చర్యలూ చేపట్టవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయంటూ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం 2024 మార్చి 14న జీవో 6ను జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే, కమిషన్‌ను సవాల్ చేస్తూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, ఐఏఎస్ అధికారులు స్మితా సభర్వాల్, ఎస్.కె. జోషిలు తెలంగాణ హైకోర్టులో వేరువేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం సుదీర్ఘ విచారణ చేపట్టి మార్చి 12న తీర్పు రిజర్వు చేసింది. తీర్పును ఈనెల 8వ తేదీన వెలువరిస్తామని ప్రకటించినా.. సాధ్యంకాకపోవటంతో ఈనెల 22కు వాయిదా వేసింది. దీంతో తాజాగా.. బుధవారం హైకోర్టు తుది తీర్పు వెలువరించింది. కాగా, హైకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రభుత్వం ఆలోచనలో పడింది. దీనిపై ఇరిగేషన్ శాఖ సమాలోచనలు చేస్తోంది. న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరుపుతోంది.

# తమిళనాడులో నేడు ఒకే విడతలో పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

తమకు అప్పగించిన కేంద్రాలకు చేరుకున్నారు. తమిళనాట మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో గురువారం పోలింగ్ జరగనుంది. అధికారిక గణాంకాల ప్రకారం 5.73 కోట్ల మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. 4,023 మంది అభ్యర్థులు తమ భవితవ్యాన్ని తేల్చుకోనున్నారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విడతలో పోలింగ్ జరుగుతుండటంతో.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఓటరు అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది. మొత్తం 1.40 లక్షల మంది పోలీసులు ఎన్నికల విధుల్లో ఉన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని ఇప్పటికే తరలించారు. సమస్యాత్మక, అత్యంత సమాస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అదనపు భద్రత కల్పించారు. మరోసారి అధికారంలోకి రావాలని డీఎంకే నేతృత్వంలోని లౌకికవాద ప్రగతిశీల కూటమి (ఎస్పీఏ), ఎలాగైనా అధికారాన్ని చేజిక్కించుకోవాలని ప్రతిపక్ష ఏఐఏడీఎంకే నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ముమ్మర ప్రయత్నాలు చేశాయి. ఓటర్లను ఆకట్టుకునేలా పథకాలు ప్రకటించాయి. కొత్తగా సినీనటుడు విజయ్ టివికె పార్టీ కూడా అదృష్టాన్ని పరీక్షించుకోబోతోంది. దక్షిణాసియాలోనే తమిళనాడు రాష్టాన్ని ఓ ఆదర్శ రాష్ట్రంగా తీర్చుదిద్దుతాని ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత స్టాలిన్ హామీ ఇవ్వగా.. తొలిసారి ఓటు వేస్తున్న ఓటర్లు ఓ తప్పుడు వ్యక్తిని ఎంచుకోవద్దని ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విజ్ఞప్తి చేశారు. తాజా ఎన్నికల్లో ప్రముఖ సినీనటుడు విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ ఎలాంటి పొత్తులు లేకుండా బరిలో నిలిచింది. అన్ని స్థానాల నుంచీ అభ్యర్థులను నిలబెట్టిన ఈ పార్టీ.. తాజా ఎన్నికల్లో కీలకంగా మారే




అవకాశం కనిపిస్తోంది. తొలిసారి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన ఆ పార్టీ అధినేత విజయ్ పెరంబూర్, తిరుచురాపల్లి తూర్పు నియోజకవర్గాల నుంచి పోటీలో నిలిచారు. పశ్చిమబెంగాల్‌లో తొలి విడత పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మొత్తం 294 అసెంబ్లీ స్థానాలకు గానూ తొలి విడతగా.. 16 జిల్లాల పరిధిలోని 152 నియోజకవర్గాల్లో పోలింగ్ నిర్వహిస్తున్నారు. అత్యంత సమస్యాత్మకమైన 8వేల పోలింగ్ కేంద్రాలను గుర్తించి.. ప్రత్యేకమైన భద్రత ఏర్పాట్లు చేశారు. పోలింగ్ జరగనున్న నియోజకవర్గాల పరిధిలో కేంద్ర బలగాలను మోహరించారు. అధికారిక సమాచారం ప్రకారం.. తొలి విడతలో సుమారు 3.60 కోట్ల మందికి పైగా ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 1.84 కోట్లు మంది పురుషులు, 1.75 కోట్లు మంది మహిళలు, 465 మంది ఇతరులు ఉన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఆ సమయానికి క్యూ లైన్లలో ఉన్న వారిని ఓటు వేసేందుకు అనుమతించనున్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కారణంగా రాష్ట్రంలో ఓట్ల సంఖ్య 7.66 కోట్ల నుంచి 6.77 కోట్లకు తగ్గింది. 2021 నాటి పరిస్థితులకు భిన్నంగా ఈసారి తృణమూల్, భాజపాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. విజయంపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేసినప్పటికీ.. విజయం నల్లేరు మీద నడకలా కనిపించడం లేదు.


# దావోస్, గ్లోబల్ సమ్మిట్ పెట్టుబడులపై ఆరా

పలు కంపెనీలతో జరిగిన ఎంఓయూ లు, పురోగతిపై సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి చర్చించారు.వివిధ రంగాలలో పెట్టుబడులకు సంబంధించి ఇప్పటి వరకు గ్రౌండ్ అయిన కంపెనీలు, పెండింగ్ వివరాలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఫ్యూచర్ సిటీతో పాటు వివిధ ప్రాంతాల్లో సంస్థలకు ప్రాధాన్యతల వారీగా కేటాయించాల్సిన భూ వివరాలను సీఎంకు తెలిపారు. డేటా సెంటర్లకు అవసరమైన నీటిని ఎస్టీపీల ద్వారా శుద్ధి చేసిన నీటిని వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. పెట్టుబడులకు ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలను మూడు కేటగిరీలుగా విభజించాలని సిఎం అన్నారు. పేరున్న బ్రాండ్ సంస్థలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. వీలైనంత త్వరగా ఎంఓయూలు కుదుర్చుకున్న సంస్థలు తమ కార్యకలాపాలు మొదలు పెట్టేలా చూడాలని, ఇందుకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలను కల్పించాలన్నారు.

# అదృష్టం కోసం ఎదురుచూస్తున్నారా?

# అయితే ఇది మీ కోసమే!

**భగవద్గీత అనేది కేవలం ప్రాచీన భారతదేశానికి చెందిన ఒక మతగ్రంథం మాత్రమే కాదు అది కాలాతీతమైన, మనుషులందరికీ వర్తించే ఒక జీవన దర్శనం. నేటి ఆధునిక ప్రపంచంలో మనం ఎదుర్కొంటున్న ఒత్తిడి, అయోమయం మరియు నిరాశలకు పరిష్కారం చూపగల అద్భుతమైన మానసిక చికిత్స ఇది. మానవ జీవితంలో అత్యంత కీలకమైన ప్రశ్న ఒకటి ఎప్పుడూ మనల్ని వెంటాడుతూనే ఉంటుంది.**



**నా** జీవితం నా చేతుల్లో ఉందా, లేక అంతా ముందుగానే రాసి పెట్టి ఉందా?అంటే, కర్మ (Effort) గొప్పదా లేక అదృష్టం (Destiny/Luck) గొప్పదా? ఈ సందిగ్ధానికి శ్రీకృష్ణుడు కురుక్షేత్ర యుద్ధభూమిలో అర్జునుడికి ఇచ్చిన సమాధానాలే మన జీవితాన్ని మార్చే తాళంచెవులు.చాలామంది 'కర్మ' అంటే కేవలం శారీరక శ్రమ అని అనుకుంటారు. కానీ భగవద్గీత దృష్టిలో కర్మ అంటే అది కాదు. కర్మ అనేది సంకల్పం, ఆలోచన మరియు క్రియల కలయిక. గీతలోని అత్యంత ప్రసిద్ధమైన శ్లోకం మనందరికీ తెలిసిందే:"కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన। మా కర్మఫలహేతుర్భూర్మా తే సంగోస్త్వకర్మణి॥ భగవద్గీత, 2వ అధ్యాయం, 47వ శ్లోకం ఈ శ్లోకం మనకు ఒక లోతైన మనస్తత్వ శాస్త్రాన్ని బోధిస్తుంది. నీకు కర్మ చేయడంపై మాత్రమే అధికారం ఉంది, ఫలితంపై కాదు అని కృష్ణుడు చెప్పినప్పుడు, ఆయన మనల్ని బాధ్యత నుండి తప్పించడం లేదు, పైగా మనల్ని ఒత్తిడి నుండి విముక్తులను చేస్తున్నాడు. మనం ఏదైనా పని చేస్తున్నప్పుడు ఫలితం గురించి అతిగా ఆలోచిస్తే, మన ఏకాగ్రత దెబ్బతింటుంది. ఫలితంపై ఆశ పెరిగితే భయం కలుగుతుంది, ఫలితం రాకపోతే క్రోధం వస్తుంది. ఈ రెండూ పని నాణ్యతను తగ్గిస్తాయి. అందుకే, ఫలితాన్ని వదిలేసి పనిలో నిమగ్నం కావడమే నిష్కామ కర్మ . ఇది వినడానికి విడ్డూరంగా అనిపించినా, నేటి కార్పొరేట్ ప్రపంచంలో దీనినే "ప్రతీశీషెవం శీజవతీ రాబ్షశీఎవ" (ఫలితం కంటే ప్రక్రియ ముఖ్యం) అని పిలుస్తున్నారు.లోకంలో చాలామంది తాము విఫలమైనప్పుడు అదృష్టం లేదు అని, ఇతరులు విజయం సాధించినప్పుడు వారికి అదృష్టం కలిసొచ్చింది అని అంటుంటారు. అయితే, భగవద్గీత అదృష్టాన్ని ఒక యాదృచ్ఛిక సంఘటనగా చూడదు. గీత ప్రకారం, ఈరోజు మనం అనుభవిస్తున్న అదృష్టం అనేది మన గత కర్మల యొక్క ప్రతిఫలమే. దీనిని ప్రారబ్ధ కర్మ అని పిలుస్తారు.కృష్ణుడు 16వ అధ్యాయంలో దైవీ సంపద మరియు ఆసురీ సంపద గురించి వివరిస్తాడు. ధైర్యం, మనశ్శుద్ధి, జ్ఞానం, దానం వంటి గుణాలు కలిగిన వ్యక్తికి సానుకూల పరిస్థితులు వాటంతట అవే వస్తాయి. అంటే, మనం చేసే పనులు, మనం అలవర్చుకునే గుణాలే మన చుట్టూ ఒక తరంగాన్ని (Energy) సృష్టిస్తాయి. ఆ తరంగాలే మనకు అదృష్ట రూపంలో తిరిగి వస్తాయి. కాబట్టి, అదృష్టం అనేది ఆకాశం నుండి ఊడిపడేది కాదు, అది మనం గతంలో నాటిన విత్తనాల నుండి వచ్చిన ఫలం.ఈ రెండింటి మధ్య యుద్ధం లేదు, కేవలం సమన్వయం మాత్రమే ఉంది. కర్మ మరియు అదృష్టం ఒకే నాణేనికి ఉన్న రెండు పార్శ్వాలు. ఒక చిన్న ఉదాహరణతో దీనిని అర్థం చేసుకోవచ్చు. ఒక రైతు పొలం దున్ని, విత్తనాలు వేసి, కలుపు తీసి సిద్ధంగా ఉంచడం అనేది 'కర్మ'. సరైన సమయంలో వాన పడటం అనేది 'అదృష్టం'. రైతు కర్మ చేయకపోతే, వాన పడినా ఫలితం ఉండదు. అలాగే, రైతు కష్టపడినా వాన పడకపోతే పంట పండదు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే వాన (అదృష్టం) మన చేతుల్లో లేదు, కానీ పొలం సిద్ధం చేయడం (కర్మ) మన చేతుల్లో ఉంది. శ్రీకృష్ణుడు మూడవ అధ్యాయంలో ఇలా అంటాడు "న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్..."అంటే, ఏ ప్రాణి కూడా ఒక్క క్షణం కూడా కర్మ చేయకుండా ఉండలేదు. ప్రకృతి సిద్ధమైన గుణాల వల్ల అందరూ పనులు చేస్తూనే ఉంటారు. మరి అలాంటప్పుడు, అంతా అదృష్టమే, నేను ఏమీ చేయను అని కూర్చోవడం ప్రకృతి విరుద్ధం. మనం చేసే ప్రతి ప్రయత్నం అదృష్టాన్ని మార్చగలదు. విధి రాతను మార్చలేమని కొందరంటారు, కానీ గీత బోధన ప్రకారం, ధృడమైన సంకల్పంతో చేసే కర్మ ద్వారా విధి యొక్క ప్రభావాన్ని మనం తట్టుకోగలము లేదా మార్చుకోగలము.ప్రస్తుత కాలంలో యువతలో డిప్రెషన్ మరియు యాంగ్జైటీ పెరగడానికి ప్రధాన కారణం ఫలితం పట్ల ఉన్న అతివ్యాప్తి. ఒక పరీక్షలో మార్కులు రాకపోయినా, వ్యాపారంలో నష్టం వచ్చినా జీవితం ముగిసిపోయిందని భావిస్తున్నారు. ఇక్కడే గీత మనకు ఓదార్పునిస్తుంది. నువ్వు నీ వంతు ప్రయత్నం చేశావు, ఆ తర్వాత జరిగేది నీ పరిధిలో లేదు. కాబట్టి బాధపడటం అనవసరం అని కృష్ణుడు అర్జునుడికి చెప్పిన మాటలు మనకు ఒక రక్షణ కవచంలా పనిచేస్తాయి.ఆధునిక మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు చెప్పే Flow Statవ" అనే భావనను గీత కొన్ని వేల ఏళ్ల క్రితమే వివరించింది. మీరు చేసే పనిని ప్రేమిస్తూ, ఫలితాన్ని దైవానికి లేదా కాలానికి వదిలేసినప్పుడు, మీలో అపరిమితమైన శక్తి ఉద్భవిస్తుంది. ఆ శక్తితో చేసే పనే అద్భుతాలను సృష్టిస్తుంది.

కర్మ సిద్ధాంతం మనకు గొప్ప జవాబుదారీతనం (Accountability) నేర్పుతుంది. నా జీవితానికి నేనే బాధ్యుడిని అనే సత్యాన్ని ఇది బోధిస్తుంది. అదృష్టం మీద భారం వేసేవాడు పరాజితుడు, కర్మను నమ్మేవాడు విజేత. మనం ఈ రోజు తీసుకునే చిన్న నిర్ణయం, మనం చేసే చిన్న సహాయం, మనం చదివే ఒక పుస్తకం ఇవన్నీ మన భవిష్యత్తు అనే అదృష్టాన్ని నిర్మిస్తాయి.గీత చెప్పే కర్మయోగి అంటే లోకాన్ని వదిలి అడవులకు వెళ్లేవాడు కాదు. తన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ, కష్టసుఖాలను సమానంగా స్వీకరించేవాడు. "సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ" అంటే సుఖదుఃఖాలను, లాభనష్టాలను, జయాజయాలను సమానంగా చూడగలిగినప్పుడే మనిషి స్థితప్రజ్ఞుడు అవుతాడు. అటువంటి స్థితిలో ఉన్న వ్యక్తికి అదృష్టం గురించి ఆందోళన ఉండదు, ఎందుకంటే అతడు చేసే ప్రతి పనీ ఒక యజ్ఞంలా మారుతుంది.భగవద్గీత ఇచ్చే అంతిమ సందేశం ఒక్కటే, "ఉద్ధరేదాత్మనాత్మానం" నిన్ను నువ్వే ఉద్ధరించుకోవాలి. ఎక్కడో బయట ఉన్న అదృష్టం కోసం వెతకడం మానేసి, నీ లోపల ఉన్న సంకల్ప శక్తిని మేల్కొల్పు. పరిస్థితులు మనల్ని నియంత్రించకూడదు, మనమే పరిస్థితులను ప్రభావితం చేయాలి. జీవితం అనేది ఒక చదరంగం లాంటిది. మనకు వచ్చే పావులు (సందర్భాలు/అదృష్టం) మన చేతుల్లో ఉండవు. కానీ, ఆ పావులను ఎలా కదపాలి అనేది పూర్తిగా మన తెలివితేటల మీద, మన కర్మ మీద ఆధారపడి ఉంటుంది. కాబట్టి, నా అదృష్టం ఎప్పుడు మారుతుంది? అని ఎదురుచూడకుండా, నా కర్మను నేను ఎలా మెరుగుపరుచుకోవాలి? అని ఆలోచించండి. మీరు సరైన మార్గంలో కర్మను ఆచరిస్తే, అదృష్టం స్వయంగా మీ చిరునామా వెతుక్కుంటూ వస్తుంది.శ్రీకృష్ణుడు అర్జునుడికి గీతను బోధించిన తర్వాత, "యథేచ్ఛసి తథా కురు" (నీకు ఇష్టం వచ్చినట్లు చేయి) అని వదిలేశాడు. అంటే, జ్ఞానాన్ని పొందిన తర్వాత నిర్ణయం తీసుకోవాల్సింది మనిషే. ఇప్పుడు మన ముందు కూడా అదే జ్ఞానం ఉంది. అదృష్టం అనే సాకుతో ఆగిపోదామా, లేక కర్మ అనే ఆయుధంతో మన భవిష్యత్తును మనమే రాసుకుందామా? ఎంపిక మీదే!నిజమైన అదృష్టం అంటే వెండి స్పూన్ తో పుట్టడం కాదు, భగవద్గీత వంటి గొప్ప జ్ఞానాన్ని అర్థం చేసుకునే మనసును కలిగి ఉండటం. ఆ జ్ఞానంతో మీ కర్మను యజ్ఞంగా మార్చండి, జీవితం ధన్యమవుతుంది.



డా .సూర్యదేవర
రామకృష్ణ ,
9490754169

## రూ.5,400 కోట్ల పెట్టుబడులతో

# రెన్యూ ఎనర్జీ గ్లోబల్

అమరావతి,ఏప్రిల్ 22(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ లోని రెన్యూవబుల్ రంగంలో భారీ పెట్టుబడులతో ఎనర్జీ ప్లాంట్ స్థాపించేందుకు ప్రముఖ రెన్యూ ఎనర్జ్ గ్లోబల్ సంస్థ ముందుకొచ్చింది. క్లీన్ ఎనర్జీ రంగంలోని ప్రధాన సంస్థల్లో ఒకటిగా ఉన్న రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ ఇప్పటికే దేశంలో 19.2 గిగావాట్ల సామర్థ్యంతో వివిధ ప్రాంతాల్లో క్లీన్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేసి ప్రముఖ స్థానంలో ఉంది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ 6 గిగా వాట్లకు పైగా ఉత్పత్తి సామర్థ్యంతో క్లీన్ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. దీంట్లో భాగంగా ఆ ప్లాంట్‌కు భూమి పూజ గురువారం జరగనుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భూమి పూజ చేయనున్నారు. మొత్తంగా రూ.5,400 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేయబోయే సంస్థకు భూమి పూజ చేపట్టడంతో అనకాపల్లి జిల్లా అభివృద్ధికి కీలక అడుగులు పడనున్నాయి. డీకార్బనైజేషన్ రంగంలో ముందంజలో ఉన్న ఈ సంస్థ.. సుమారు రూ.4,200 కోట్ల పెట్టుబడితో 6 గిగావాట్ల సామర్థ్యం గల సోలార్ ఇంగాట్?వేఫర్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయబోతోంది. దీంతో పాటు మరో రూ.1,200 కోట్ల వ్యయంతో 125 మెగావాట్ల హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యూవబుల్ పవర్ ప్రాజెక్ట్‌ను నిర్మించనుంది. ఈ రెండు ప్రాజెక్టులు వచ్చే రెండేళ్లలో పూర్తి కానున్నాయి. రెన్యూ సంస్థ నిర్మించే సోలార్ ఇంగాట్?వేఫర్ తయారీ యూనిట్, హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యూవబుల్ పవర్ ప్రాజెక్టుల ద్వారా సుమారు 2,100 మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. దీంతో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు లభించనున్నాయి. రాష్ట్రంలో క్లీన్ ఎనర్జీని భారీ ఎత్తున ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకెళ్తున్నారు. ఇంధన రంగం బలోపేతమైతే పారిశ్రామిక, వ్యవసాయ, సేవా రంగాలు వేగంగా వృద్ధి చెందుతాయని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ఏపీని రెన్యువబుల్ ఎనర్జీకి కేంద్రంగా నిలబెట్టడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి అడుగులు వేస్తున్నారు. గతేడాది నవంబర్‌లో విశాఖపట్నంలో జరిగిన సీఐఐ పార్టనర్ సమ్మిట్‌కు హాజరైన రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ రాష్ట్రంలో దశలవారీగా రూ.82,000 కోట్ల పెట్టుబడులు పెడతామని ప్రకటించింది. దీంట్లో భాగంగా అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో ఎనర్జీ ఎ÷-లాంట్ ఏర్పాటుకు పనులను ప్రారంభించనుండగా త్వరలోనే సుమారుగా రూ.22,000 కోట్లతో దేశంలోనే అతిపెద్ద హైబ్రిడ్ రిన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టులలో ఒకదాన్ని అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ పక్రియ చేపట్టనుంది. 2014-19 మధ్య కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడే 2015లో కళ్యాణదుర్గం లో విండ్ ప్రాజెక్ట్‌తో రాష్ట్రంలోకి రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ అడుగుపెట్టింది. 717 మెగావాట్ల విండ్, 60 మెగావాట్ల సోలార్ ఎనర్జీ సామర్థ్యంతో ఏపీలోని రెన్యూ ఎనర్జీ గ్లోబల్ ఎ÷-లాంట్లు ఇప్పటికే పని చేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉత్తరాంధ్రకు పరిశ్రమలు క్యూ కడుతున్నాయి. ఇప్పటికే ఆర్సెలార్ మిట్టల్, కాగ్నిజెంట్‌కు వంటి ప్రముఖ సంస్థలకు శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. టీసీఎస్ ఇప్పటికే కార్యకలాపాలను ప్రారంభించింది. ఈ నెలలో అతిపెద్ద అంతర్జాతీయ పెట్టుబడి గూగుల్ సంస్థకు శంకుస్థాపన చేయనున్నారు. సాఫ్ట్ వేర్, ఎనర్జీ, స్టీల్, మెడ్ టెక్, ఫార్మా వంటి రంగాల్లో ఉత్తరాంధ్ర ప్రాంతం భారీగా పెట్టుబడులను ఆకర్షిస్తోంది. అలాగే భోగాపురం ఎయిర్ పోర్టు త్వరలో అందుబాటులోకి రానుంది. మరోవైపు పర్యాటకంగా? ఆధ్యాత్మికంగా కూడా ఉత్తరాంధ్రలో అభివృద్ధి పెద్ద ఎత్తున చోటు చేసుకుంటోంది. ఉదయం 09.30 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి నుంచి జెడ్.చింతువకు బయలుదేరి వెళతారు.

## మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు మృతి

తెలిపిన ముఖ్యమంత్రి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి భాస్కరరావు 90 ఏళ్ల వయస్సులో మృతి చెందిన విషయం తెలిసిందే. నెల రోజులుగా హైదరాబాద్‌లోని కాంటినెంటల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఈరోజు తుదిశ్వాస విడిచారు. గురువారం పంజాగుట్ట శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 1978లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన, 1984లో నెల రోజుల పాటు ఏపీ సీఎంగా పని చేశారు.

# పిఠాపురం ఘటనపై సీఎం చంద్రబాబు సీరియస్

## మాజీ ఎమ్మెల్యే వర్మ వ్యవహారంపై అసహనం

## వర్మతో మాట్లాడాలని పల్లాకు బాబు ఆదేశం

అమరావతి: పిఠాపురంలో జరిగిన ప్రొటోకాల్ అంశంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే వర్మ వ్యవహారంపై ఘాటుగా స్పందించారు. ఈ ఘటనపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ, పార్టీ నేతలు ఐక్యంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ అంశంపై తెలుగుదేశం పార్టీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో సీఎం మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. టీడీపీ నేతలు ప్రొటోకాల్ పేరుతో, ఫ్లెక్సీల్లో ఫొటోల ప్రాధాన్యం కోసం ఘర్షణ పడటం సరికాదని సీఎం వ్యాఖ్యానించారు. పిఠాపురం ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ పాడా సమావేశం సందర్భంగా జరిగిన ఈ వివాదంలో మాజీ ఎమ్మెల్యే వర్మ వ్యవహరించిన తీరు సరికాదని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. పార్టీ నాయకులు ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన అవసరం ఉందని, ఇలాంటి సంఘటనలు పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తాయని ఆయన పేర్కొన్నారు.ఈ ఘటనపై సీఎం చంద్రబాబు టీడీపీ నేతలకు కొన్ని కీలక సూచనలు చేశారు. ఏదైనా సమస్య ఉంటే పార్టీ పెద్దలకు లేదా ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ప్రత్యక్షంగా గొడవలు పడటం సరైన పద్ధతి కాదని తెలిపారు. ఇలాంటి ఘటనలు కేడర్‌కు తప్పుడు సంకేతాలు పంపుతాయని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని హుకుం జారీ చేశారు. ఈ వ్యవహారంలో మాజీ ఎమ్మెల్యే వర్మకు తగిన సూచనలు ఇవ్వాలని పల్లా శ్రీనివాసరావును ఆదేశించారు. పార్టీ అంతర్గత క్రమశిక్షణను కాపాడాలని, నేతలు వ్యక్తిగత ప్రాధాన్యం కోసం పోటీ పడకూడదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# నల్లగొండజిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

## కారును వేగంగా ఢీకొన్న కారు ..ముగ్గురు దుర్మరణం

నల్గొండ,ఏప్రిల్ : నల్లగొండజిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కారు.. బైకును ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. శాకాజిపురానికి చెందిన బాల్‌రెడ్డి, అలివేలు, పాల్వాయి గ్రామానికి చెందిన మంజుల, వెంకటమ్మ నల్గొండలో జరిగిన ఓ శుభకార్యానికి వెళ్లారు. కార్యక్రమం ముగిసిన తర్వాత కారులో తిరుగు ప్రయాణం అయ్యారు. వద్దిరెడ్డిగూడెం సమీపంలో అతి వేగం కారణంగా కారు ప్రమాదానికి గురైంది. ఓ బైకును ఢీకొట్టి కారు అదుపుతప్పింది. ఆ వెంటనే ఓ చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న కనగల్‌కు చెందిన మధుబాబు, ధనుంజయ అక్కడికక్కడే చనిపోయారు. కారులో ఉన్న బాల్‌రెడ్డి కూడా సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. కారులో ఉన్న మరో ముగ్గురికి గాయాలు అయ్యాయి. స్థానికులు ప్రమాదం గురించిన సమాచారాన్ని పోలీసులకు అందించారు. పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డ వారిని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.




# భారతినగర్‌లో జలమండలి ఈడీ పర్యటన

- డ్రైనేజీ సమస్యలపై ప్రత్యక్ష పరిశీలన
- పైప్‌లైన్ స్లోప్స్ మార్పులకు సూచనలు
- బీడీఎల్ కాలనీ పనులు వెంటనే ప్రారంభించాలి
- హెచ్ఐజీ కాలనీలో కనెక్షన్ల మార్పు వేగవంతం
- కాలనీల్లో అవుట్‌లెట్ ఏర్పాట్లపై ఆదేశాలు
- రామచంద్ర రెడ్డి నగర్‌లో పనుల తనిఖీ
- హైవే మెయిన్ హోల్స్‌కు లైన్ల అనుసంధానం
- రూ.40 లక్షల నిధుల బదిలీకి విజ్ఞప్తి
- బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి





**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఏప్రిల్ 22:** పటాన్‌చెరు నియోజకవర్గంలోని భారతినగర్ డివిజన్‌లో జలమండలి సైబరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్‌ను స్లోప్స్‌కు అనుగుణంగా మార్పులు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. అవసరమున్న చోట్ల కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేసి వెంటనే అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు. బీడీఎల్ కాలనీలో పైప్‌లైన్ కొరత కారణంగా నిలిచిపోయిన పనులను తక్షణమే ప్రారంభించాలని, హెచ్ఐజీ కాలనీలో బల్క్ కనెక్షన్లను వ్యక్తిగత కనెక్షన్లుగా మార్చే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే కాలనీల్లో డ్రైనేజీ పైపులైన్‌కు సరైన అవుట్‌లెట్ ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. రామచంద్ర రెడ్డి నగర్ కాలనీలో నేషనల్ హైవే వద్ద జరుగుతున్న ప్రధాన పైప్‌లైన్ పనులను పరిశీలించి, కాలనీ లైన్లను మెయిన్ హోల్స్‌కు అనుసంధానం చేయాలని సూచించారు. అనంతరం జోనల్ కమిషనర్ హేమంత్‌ను కలిసి పాతగా ఉన్న రూ.40 లక్షల నిధులను జలమండలి శాఖకు బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం శివ, ఏఈ శ్రీకాంత్, సిబ్బంది నాయక్, కాలనీ నివాసితులు పాల్గొన్నారు.



# కడిగిన ఆణిముత్యం కేసీఆర్

### కాంగ్రెస్ దే పీసి ఘోష్ కమిషన్

### హైకోర్టు తీర్పు కాంగ్రెస్ కు చెంపపెట్టు

### బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రాంచంద్రా రెడ్డి

క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) ఏప్రిల్ 22: ఎన్ని విచారణలు చేసుకున్నా ఎన్ని కుట్రలు పన్నిన కేసీఆర్ పై చేసిన ఆరోపణలు తప్పు అని హైకోర్టు తీర్పుతో నిరూపితం అయ్యిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రా రెడ్డి అన్నారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్ష అని, కడిగిన ఆణిముత్యం అని అభివర్ణించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో పిసి.ఘోష్ కమీషన్ నివేదికపై హైకోర్టు తీర్పుతో మా వాదన నిజం అయ్యిందన్నారు. ఘోష్ కమీషన్ కాదు కాంగ్రెస్ ఘోష అని బీఆర్ఎస్ పార్టీ ముందే చెప్పిందని, కాంగ్రెస్ నేతలు మాట్లాడిన మాటలను ఘోష్ రిపోర్టు రూపంలో ఇచ్చారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడం ఇష్టం లేని ఏపీ పెద్దల కుట్ర ఉందని, రాష్ట్రంలో సీఎం కుటుంబ సభ్యులు,మంత్రుల కమీషన్ల దందా నడుస్తోందని ఆరోపించారు. కాళేశ్వరం అంటే ఒక్క మేడిగడ్డ మాత్రమే కాదని, తెలంగాణలో సిరులు పండించే కల్పవల్లి అని చెప్పుకొచ్చారు. కాళేశ్వరంలో లక్ష కోట్ల అవినీతి అంటే బిఆర్ఎస్ కార్యకర్తలు చెప్పుతో కొట్టాలని పిలుపునిచ్చారు.

## ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



**చౌటుప్పల్,ఏప్రిల్ 22,క్రైమ్ మిర్రర్ :** చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లోని ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి ఎం.జే.యఫ్ లయన్ సిలువేరు మంగయ్య సౌజన్యంతో ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిలువేరు మంగయ్య మాట్లాడుతూ.. ఈ పంపిణీ కార్యక్రమం ఈనెల 30 వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ట్రాఫిక్ సిఐ విజయ మోహన్ మాట్లాడుతూ.. వేసవికాలంలో ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజెఎఫ్ అధ్యక్షులు తిరందాసు జగన్, సెక్రెటరీ మహమ్మద్ అత్తర్ పాషా, ట్రెజరర్ సిలివేలు మంగయ్య, నాంపల్లి రమేష్, కాసుల వెంకటేశం,కటికం ప్రశాంత్, కోసం రామ్ రెడ్డి, కంసుదు చంద్రశేఖర్, దాచేపల్లి శ్రీనివాస్ గుప్తా, వేముల నరసింహ,చింతల ప్రభాకర్ రెడ్డి, పాల్గొన్నారు.

## వాహన తనిఖీలో ఆటో దొంగ అరెస్ట్ -- ఐదు కేసుల్లో నిందితుడు



**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఏప్రిల్ 22:** కిస్టారెడ్డిపేట చౌరస్తా వద్ద వాహన తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులకు అనుమానాస్పదంగా నంబర్ ప్లేట్ లేకుండా వస్తున్న ఆటో కనిపించగా ఆపేందుకు ప్రయత్నించారు. ఈ సమయంలో ఆటోలో ఉన్న వ్యక్తి పారిపోవడానికి యత్నించగా పోలీసులు వెంటాడి పట్టుకున్నారు. పట్టుబడిన వ్యక్తి తన పేరు హిమాన్షు యాదవ్ (22), ఇస్నాపూర్ నివాసి అని తెలిపాడు. విచారణలో భాగంగా మార్చి 21న అమీన్పూర్‌లో ఒక ఇంటి వద్ద నుంచి బజాజ్ సిఎన్జి ఆటోను దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. దొంగిలించిన ఆటోను ఇంటి వద్ద దాచిపెట్టి, నంబర్ ప్లేట్ తీసేసి అమ్మేందుకు తీసుకెళ్తుండగా పోలీసుల తనిఖీలో చిక్కినట్లు వెల్లడించాడు. నిందితుడి వద్ద నుంచి ం+ 34 ం 4937 నంబర్ గల ఎకో గ్రీన్ రంగు బజాజ్ సిఎన్జి ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతను అలవాటుపడిన నేరస్తుడని, పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఇప్పటికే ఐదు దొంగతనం కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుణ్ణి రిమాండ్‌కు తరలించినట్లు అమీన్పూర్ ఇన్‌స్పెక్టర్ నరేష్, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ వెల్లడించారు.

**శ్రీనివాస్ మృతి కేసు**

# గొంతు నులిమి హత్య చేసి ప్రమాదవశాత్తు చనిపోయాడని చిత్రీకరణ



నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన శ్రీనివాస్ మృతి కేసును పోలీసులు ఛేదించారు. తొలుత ప్రమాదవశాత్తు జరిగిన మరణంగా భావించిన ఈ ఘటన, విచారణలో పక్కా పథకం ప్రకారం జరిగిన హత్యగా తేలింది. ఆమనగల్ మండలం పద్మశాలి కాలనీకి చెందిన బొక్క శ్రీనివాస్ (48), అతని భార్య వెంకటమ్మతో కలిసి పెద్దాపూర్ గ్రామంలో జామ, మామిడి తోటను కౌలుకు తీసుకుని పండ్ల వ్యాపారం చేస్తూ అక్కడే నివసిస్తున్నారు. ఈ నెల 13న తోట వద్ద ఉన్న శ్రీనివాస్‌ను అదే గ్రామానికి చెందిన పబ్బ చక్రవర్తి గౌడ్ మరికొందరితో కలిసి సంపు వద్దకు వచ్చాడు. ఈ సందర్భంగా తోటలోకి ఎందుకు వచ్చావని ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీనిని మనసులో పెట్టుకున్న చక్రవర్తి గౌడ్, సాయంత్రం శ్రీనివాస్ ఒంటరిగా ఉన్న సమయంలో దాడి చేశాడు. వాటర్ సంపు వద్ద కాళ్లు కడుక్కుంటున్న సమయంలో వెనుక నుంచి వెళ్లి గొంతు నులిమి హత్య చేసి, ఘటనను ప్రమాదంగా మలిచేందుకు మృతదేహాన్ని సంపులో పడేశాడు. సాక్ష్యాలను చెరిపివేయడానికి దుస్తులు, మొబైల్ ఫోన్‌ను కూడా సంపులో వేసి అక్కడి నుంచి పరారయ్యాడు. మరుసటి రోజు మృతదేహం లభ్యమవడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. లోతైన విచారణలో నిందితుడు బయటపడటంతో కేసును హత్యగా మార్చి చక్రవర్తి గౌడ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును వేగంగా ఛేదించిన వెల్దండ సీఐ రఘువీర్ రెడ్డి, ఎస్ఐ కురుమూర్తి మరియు సిబ్బందిని ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ పాటిల్, డీఎస్పీ వెంకట్ రెడ్డి అభినందించారు.



# ఘోష్ కమిషన్ తీర్పు కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టు

### మాజీ మంత్రి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

**నర్సాపూర్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, ఏప్రిల్ 22:** తెలంగాణ హైకోర్టు బుధవారం కాలేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ పై ఇచ్చిన ఘోష్ కమిషన్ తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని మాజీ మంత్రి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ముఖ్యంగా " ఘోష్ కమిషన్ "పై వచ్చిన ఆదేశాలను స్వాగతిస్తున్నామని అన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని, ఘోష్ కమిషన్ పేరుతో మాజీ ముఖ్యమంత్రి ప్రతిపక్ష నాయకుడు చంద్రశేఖర్ రావు ని వేధించడం ఇది కక్షపూరిత చర్య అని తెలిపారు. కొన్ని రోజులు కాళేశ్వరం పేరుతో, మరికొన్ని రోజులు ఫార్ములా రేస్ పేరుతో, ఇంకొన్ని రోజులు ఫోన్ ట్యాపింగ్ అంటూ ప్రజల దృష్టి మళ్లించే డైవర్షన్ రాజకీయాలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటైపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కనబెట్టి, ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని పూర్తిగా అమలు చేసే వరకు ప్రజల తరపున నిరంతరం పోరాడుతూనే ఉంటామని చెప్పారు. చంద్రశేఖర్ రావు సభ నిర్వహించిన రోజునే కావాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో సభ ఏర్పాటు చేయడం రాజకీయ ప్రతీకార ధోరణిని సూచిస్తుందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ తెలంగాణ ప్రజల పక్షాన నిలబడి, వారి హక్కుల కోసం పోరాడుతుందని తెలిపారు. కాళేశ్వరం వంటి మహత్తర ప్రాజెక్టులను రక్షించడం, రైతుల ప్రయోజనాలను కాపాడడం బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ..మహిళా వ్యతిరేకి - సర్పంచ్ సుర్వి సౌజన్య రాజుగౌడ్



**సశీస్థాన్ నారాయణపూరశీ,ఏప్రిల్ 22(క్రైమ్ మిర్రర్):** కాంగ్రెస్ పార్టీ మహిళా వ్యతిరేకి అని మొన్న పార్లమెంట్లో ప్రవేశపెట్టిన చట్టసభల్లో 33% మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడానికి కాంగ్రెస్ పార్టీ ప్రధాన కారణమని అల్లందేవిచెర్వు గ్రామ సర్పంచ్ సుర్వి సౌజన్య రాజు గౌడ్ అన్నారు. బుధవారం అల్లందేవిచెర్వు గ్రామంలో ఏర్పాటు చేసిన ఓ సమావేశంలో ఆమె మాట్లాడుతూ దేశ మహిళల శక్తి,సామర్థ్యాలను గౌరవిస్తూ భారతీయ జనతా పార్టీ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టసభల్లో 33% మహిళా రిజర్వేషన్ బిల్లు నారీశక్తి వందన్ అభినియం చారిత్రాత్మక సంస్కరణగా నిలిచింది. మహిళలకు రాజకీయ రంగంలో సముచిత స్థానం కల్పించాలనే నిజమైన సంకల్పంతో తీసుకొచ్చిన ఈ బిల్లును దేశ ప్రజలు, అందులోనూ మహిళలు హర్షిస్తున్నారు. అయితే,ఈ చారిత్రాత్మక బిల్లును కాంగ్రెస్ పార్టీ మరి దాని తోక పార్టీల ద్వారా వ్యతిరేకించడం అత్యంత ఖండనీయం. మహిళల హక్కుల గురించి పెద్ద పెద్ద మాటలు మాట్లాడే కాంగ్రెస్ పార్టీ నాయకులు అసలు పరీక్ష వచ్చినప్పుడు తమ అసలు స్వరూపాన్ని బయటపెట్టారు. సంవత్సరాల పాటు అధికారంలో ఉన్నప్పటికీ మహిళలకు 33% రిజర్వేషన్ ఇవ్వలేకపోయిన కాంగ్రెస్, ఇప్పుడు అదే బిల్లును వ్యతిరేకించడం పూర్తిగా ద్వంద్వ వైఖరి. మహిళల సాధికారతకు అడ్డుపడే రాజకీయ శక్తుల అసలు ముఖాన్ని దేశ ప్రజలు గుర్తించాల్సిన సమయం వచ్చింది. మహిళల అభివృద్ధి, సమాన హక్కుల విషయంలో కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి నిజాయితీ లేదని ఈ సంఘటన స్పష్టం చేస్తోంది, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన మహాలక్ష్మి పథకం ద్వారా నెలకు 2500 రూపాయలు ఇస్తామని చెప్పి మహిళలను మోసం చేయడం జరిగిందని,దానితోపాటు మహిళలకు అనేక హామీలు ఇచ్చిన ఈ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు మొండిచేయి చూపించిందని కేవలం ఎన్నికలు వచ్చినప్పుడు ఓటు బ్యాంకుగానే చూస్తూ కాంగ్రెస్ పార్టీ మహిళలను అవమానిస్తుందని వారు అన్నారుభారతీయ జనతా పార్టీ మాత్రం మాటల్లో కాదు,చేతల్లో చూపుతూ మహిళల అభ్యున్నతికి కట్టుబడి ఉంది. గ్రామ స్థాయి నుండి దేశ స్థాయి వరకు మహిళలు నాయకత్వం వహించేలా మార్గం సుగమం చేస్తోందని,ఒక మహిళా సర్పంచ్‌గా నేను స్పష్టం చేస్తున్నాను మహిళల హక్కులను అడ్డుకునే శక్తులైన కాంగ్రెస్ పార్టీ మరియు దాని తోక పార్టీలను దేశ మహిళలు ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించరని,ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వారికి తగిన గుణపాఠం చెప్పాలని ఆమె మహిళలకు పిలుపునిచ్చారు.

## వెంచర్ దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన

### నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి: కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల, ఏప్రిల్ 22 (క్రైమ్ మిర్రర్) : వెంచర్ల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులకు సూచించారు. క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో వెంచర్ ఏర్పాటుకు సంబంధించిన భూమిని బుధవారం కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రణాళిక అధికారి సంపత్‌తో కలిసి భూమి పరిస్థితులు, రికార్డులను సమీక్షించారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ తెలిపారు. వెంచర్ దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం భూమి రికార్డులను సరిచూసి, నిబంధనలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ప్రజల పక్షాన బీజేపీ నిరంతరం పోరాడుతుంది

## గతంలో సర్వీస్ రోడ్డు వెంట డ్రైనేజీల నిర్మాణం నాణ్యత లేకుండా పూర్తి చేశారు...

## నేటికీ అక్రమ కట్టడాలను తొలగించకపోవడం సిగ్గుచేటు...

## చౌటుప్పల్ బిజెపి అధ్యక్షురాలు కదారి కల్పన యాదవ్

**చౌటుప్పల్,ఏప్రిల్ 22,క్రైమ్ మిర్రర్:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజల పక్షాన బిజెపి నిరంతరం పోరాడుతుందని చౌటుప్పల్ బిజెపి మున్సిపల్ అధ్యక్షురాలు కదారి కల్పన యాదవ్ స్పష్టం చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ...చౌటుప్పల పట్టణంలో హైవే - 65 పై ఓవర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేయాలని, అదేవిధంగా బస్టాండ్ దగ్గర వెహికల్ అండర్ పాస్ ఏర్పాటు చేయాలని రీజినల్ ఆఫీసర్ కి ఈనెల 17 న బిజెపి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేయడం జరిగిందని గుర్తు చేశారు. ఈ విషయంపై స్పందించిన ఆర్ ఓ ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటు చేయాలంటే కొన్ని నిర్మాణాలు అడ్డుగా ఉన్నవని తెలిపారన్నారు.వెహికల్ అండర్ పాస్ నిర్మాణం చేయడానికి సిద్ధమని హామీ ఇచ్చారని తెలిపారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే ఇది సున్నితమైన అంశం,రోడ్డు నిర్మాణం పూర్తి కావాలంటే చాలా సమయం పడుతుందనటాన్ని బిజెపి తీవ్రంగా ఖండిస్తుందన్నారు. గత రెండు సంవత్సరాల నుండి ఫ్లైఓవర్ నిర్మాణం స్థానిక ఎమ్మెల్యే నిర్లక్ష్యం మూలంగా రోడ్డు నిర్మాణ పనుల్లో కాలయాపన



జరుగుతున్నదన్నారు. తద్వారా ఈ ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుచున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ఎమ్మెల్యేకి చిత్తశుద్ధి ఉంటే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి మైనార్టీ సోదరులతో మాట్లాడి ఈ సమస్యకు పరిష్కారం చేయాలన్నారు. పూర్వపు కొలతల ప్రకారం రోడ్డు నిర్మాణం చేయాలని భారతీయ జనతా పార్టీ కోరుచున్నదన్నారు.గతంలో రోడ్డు వెడల్పులకు నష్టపరిహారం సుమారు కోటి రుపాయలకు పైగా తీసుకున్నారని,అదనపు స్థలం కూడా తీసుకున్నారని ఈ విషయం ప్రజలకు కూడా తెలుసన్నారు.అయినా నేటికీ అక్రమ కట్టడాలను తొలగించకపోవడం సిగ్గుచేటన్నారు.ఈ అక్రమ కట్టడాలు తొలగించకపోవడం,సర్వీసు రోడ్డు లేకపోవడంతో లక్కారం నుండి చౌటుప్పల్ కి వచ్చే ప్రజలు ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోగొట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రోడ్డు ప్రమాదంలో చాలామంది గాయాలపా లైనారని తెలిపారు.అయినా స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్, అధికారులు ఎవరు స్పందించలేద న్నారు.లాంటి సున్నితమైన ప్రజా సమస్యలపై బిజెపి ఎప్పుడు పోరాడుతూ సమస్యలు పరిష్కారమయ్యే విధంగా ప్రజా ఉద్యమాలు చేస్తుందన్నారు. బీజేపీకి ఎక్కడ పేరు వస్తుందోనని కాంగ్రెస్,బిఆర్ఎస్ వారి అనుబంధ పార్టీలు తర్వాత స్పందించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని తద్వారా ప్రజలను, అధికారులను అయోమయానికి గురి చేస్తున్నారని పేర్కొన్నారు.రోడ్డు వంతెన నిర్మాణం విడితి సుమారు 200 మీటర్లు తగ్గటంతో కోట్లాది రూపాయలు ఏమవుతున్నవని ప్రశ్నించారు. గతంలో సర్వీసు రోడ్డు నిర్మాణం, సర్వీస్ రోడ్డు వెంట ఉండే డ్రైనేజీల నిర్మాణం నాణ్యత లేకుండా ఆశాస్త్రీయంగా పూర్తి చేశారన్నారు.సర్వీసు రోడ్లు ఉన్న విడితిని తగ్గించి అండర్ గ్రౌండ్ నిర్మాణం చేశారని,గతంలో బిజెపి ఆధ్వర్యంలో అధికారుల దృష్టికి తీసుకువెళ్లి నా స్పందించలేదని ఆనాడు చేసిన పొరపాటుకు పట్టణంలోని వ్యాపారులు, ప్రజలు అనేక ఇబ్బందుల గురవుతున్నారన్నారన్నారు.కాబట్టి చౌటుప్పల్ పట్టణంలో అండర్పాస్ నిర్మాణం అయ్యేంతవరకు, పూర్వపు కొలతల ప్రకారం హైవే పై వంతెన నిర్మాణం జరిగే వరకు ప్రజల పక్షాన బిజెపి పోరాడుతుందని అన్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దూడల బిక్షం గౌడ్,జిల్లా మాజీ ఉపాధ్యక్షులు రమణ గోని శంకర్, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, గుజ్జుల సురేందర్ రెడ్డి, ముత్యాల భూపాల్ రెడ్డి,18వ వార్డు కౌన్సిలర్ బుడ్డ సురేష్, 2వ వార్డ్ కౌన్సిలర్ పోలేపల్లి లక్ష్మి,కదారి ఐలయ్య, పోలేపల్లి ముత్తయ్య, వంగల రమాకాంత్,కానుగు శేఖర్, పర్నే శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ రాజ్యాధికార పార్టీలో ఇర్ఫాన్ సాబ్రీ చేరిక

### సంగారెడ్డి టౌన్ అధ్యక్షుడిగా ప్రకటన

**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఏప్రిల్ 22:** సంగారెడ్డి టౌన్ కి చెందిన ఇర్ఫాన్ సాబ్రీ తెలంగాణ రాజ్యాధికార పార్టీలో బుధవారం చేరారు. ఈ సందర్భంగా ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయనను పార్టీ సంగారెడ్డి టౌన్ అధ్యక్షుడిగా ప్రకటించారు.ఈ సందర్భంగా ఇర్ఫాన్ సాబ్రీ మాట్లాడుతూ... తీన్మార్ మల్లన్న నాయకత్వంలోనే బహుజన రాజ్యం సాధ్యమవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. తన పై నమ్మకం ఉంచి టౌన్ అధ్యక్షుడి బాధ్యత అప్పచెప్పినందుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఇక నుండి తెలంగాణ రాజ్యాధికార పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు రమేష్ యాదవ్, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు ఎం.డి. నవాజ్, మహిళ అధ్యక్షురాలు ప్రేమలత, జిల్లా అధ్యక్షుడు రవి నాయక్, మండల అధ్యక్షుడు ఎం.డి. యూసుఫ్, తదితర పార్టీ శ్రేణులు, కార్మికులు పాల్గొన్నారు.

# పెళ్లి కూతురికి పుస్తె మెట్టెలు అందించిన మాజీ సర్పంచ్ భాస్కర్ గౌడ్

**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఏప్రిల్ 22:** సాదుల్లా నగర్ గ్రామంలో పలకల ఆశయ్యా, కమలమ్మ దంపతుల కుమార్తె మానసకు పుస్తె మెట్టెలు బహుకరణ కార్యక్రమం బుధవారం సాంప్రదాయబద్ధంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ భాస్కర్ గౌడ్ పుస్తె మెట్టెలు అందజేసి వధువు మానసను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అందూరి శేఖర్, యాదగిరి తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ పెద్దలు, బంధుమిత్రులు హాజరై కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించగా, మానస భవిష్యత్తు సుఖసంతోషాలతో నిండాలని భాస్కర్ గౌడ్ ఆకాంక్షించారు.



# సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు యూనివర్సిటీ అధ్యాపక కార్యవర్గం ఏర్పాటు: టిజిఆప్ట

### యూనివర్సిటీ అధ్యక్షులుగా డా. సి హెచ్ చంద్రయ్య



**కూకట్ పల్లి, ఏప్రిల్ 22 (క్రైమ్ మిర్రర్) :** తెలంగాణ అల్ యూనివర్సిటీస్ పార్ట్ టైం అధ్యాపకుల సంఘము (టిజిఆప్ట) అధ్వర్యంలో మంగళవారం సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు విశ్వవిద్యాల యంలో యూనివర్సిటీ కమిటీ నియమించారు. వివిధ రకాలుగా పనిచేస్తున్న అధ్యాపకులు పార్ట్ టైం( అవర్ బేసిస్), గెస్ట్ పాకల్టీ, ఏక మొత్తం పాకల్టీ లుగా పనిచేస్తున్నారు. అందరికీ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ప్రకారం ప్రతి అధ్యాపకునికి నెలకు 50,000/- జీతం కన్సాలిడేటెడ్ పేమెంట్ ఇవ్వాలని, ఇంత వరకు టీజీఆప్ట చేసిన, చేస్తున్న ప్రయత్నాలు ప్రభుత్వ స్పందన వివరించి అధ్యాపకుల సమిష్టికృషి వల్లనే లక్ష్యం చేరుకొంటామని దిశానిర్దేశం చేశారు. అనంతరం యూనివర్సిటీ కమిటీనీ నియమించారు. అందరి ఆమోదంతో సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు యూనివర్సిటీ (టీజిఆప్ట -ఎస్ పిఆర్ టియూ) అధ్యక్షులుగా డా.సి హెచ్ చంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా డా. ఎం. రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ లుగా డా. ఎన్ శ్రీనివాసన్, డా. షేక్ హసీన, డా. రవీందర్ నాయక్, డా. రాయల హరిచంద్ర, డా మంచాల మహేశ్వర్ లను అందరి అధ్యాపకుల ఆమోదంతో నియమించుకున్నారు. ఈ సందర్భంగా టి జి ఆప్ట రాష్ట్ర కార్యవర్గం నూతనంగా ఎంపికైన యూనివర్శిటీ కమిటీకి అధ్యక్ష కార్యదర్శులకు శుభాకాంక్షలు తెలుపుతూ అధ్యాపకుల సంక్షేమం కోసం పనిచేయాలని, మీకు రాష్ట్ర నాయకత్వం ఎల్లవేళలా తోడుగా ఉంటుందని, ప్రజాప్రభుత్వంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారులతో, ప్రభుత్వంతో సఖ్యతగా ఉంటూ అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరించుకునేలా పనిచేయాలని టీజీఆప్ట రాష్ట్ర కార్యవర్గం సూచించింది.

# నాదెండ్ల భాస్కరరావు పార్థివ దేహానికి నివాళులు అర్పించిన జనసేన నాయకులు ప్రేమ కుమార్



**కూకట్ పల్లి, ఏప్రిల్ 22 (క్రైమ్ మిర్రర్) :** జనసేన పార్టీ పిఎసి ఛైర్మన్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తండ్రి, మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు పరమపదించారనే దుఃఖవార్త తెలిసిన వెంటనే, జనసేన నాయకులు జూబ్లీ హిల్స్ లోని వారి నివాసానికి చేరుకుని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జనసేన పార్టీ కోఆర్డినేటర్ ముమ్మారెడ్డి ప్రేమకుమార్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్ కోఆర్డినేటర్ మచ్చ సుధాకర్, జనసేన నాయకులు కొల్లా శంకర్, పోలేబోయిన శ్రీనివాస్ కలిసి మనోహర్ ని పరామర్శించి, మనోధైర్యం చెప్పి, సానుభూతి వ్యక్తం చేరారు. ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, వారి కుటుంబానికి ఈ లోటు తీరనిదని, కానీ భాస్కర్ రావు సేవలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి భాస్కర్ రావు రాష్ట్ర రాజకీయాలలో విశిష్టమైన స్థానం సంపాదించారని, ప్రజాసేవలో ఆయన చూపిన నిబద్ధత ప్రతి ఒక్కరికీ ఆదర్శమని కొనియాడారు. ఆయన మరణం రాష్ట్రానికి పెద్ద లోటు అని అభిప్రాయపడి, ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ పరామర్శ కార్యక్రమంలో పాల్గొన్న జనసేన నాయకులు అందరూ కలసి భాస్కర్ రావు పర్ధీవ దేహానికి పుష్పాంజలి ఘటించి, నివాళులు అర్పించారు.

# నిరుపేదల కోసం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులకు కళిన హెచ్చరిక

**కూకట్ పల్లి, ఏప్రిల్ 22 (క్రైమ్ మిర్రర్) :** కూకట్‌పల్లి నియోజకవర్గంలో స్థానిక సమస్యలపై కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మున్సిపల్ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ ను కలిసి ప్రజా సమస్యల పరిష్కారంపై గట్టిగా స్పందించారు. ముఖ్యంగా ఇటీవల కూకట్‌పల్లిలో రోడ్డు పక్కన చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నిరుపేదలను మున్సిపల్ అధికారులు అకస్మాత్తుగా తొలగించడం తీవ్ర ఆందోళనకు దారితీసింది.“రెక్కాడితే గాని డొక్కాడని” పరిస్థితిలో ఉన్న ఈ కుటుంబాలు ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో వారి జీవితం సంక్షోభంలో పడిందని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పష్టం చేస్తూ ప్రత్యామ్నాయ స్థలం చూపకుండా వ్యాపారులను తొలగించడం అన్యాయం అని పేర్కొన్నారు. ముందు వారికి సరైన స్థలం కేటాయించి, ఆ తర్వాతే తొలగింపులు చేపట్టాలని సూచించారు. లేకపోతే



మున్సిపల్ కార్యాలయం ఎదుట భారీ ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించి, సమస్యను మానవీయ దృష్టితో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యే మరో ముఖ్య అంశాన్ని ప్రస్తావించారు. కూకట్‌పల్లి లాంటి రద్దీ ప్రాంతాల్లో 20-30 ఏళ్లుగా పూలు, పళ్ళు అమ్ముతూ జీవనం సాగిస్తున్న వారిని అర్ధాంతరంగా తొలగించడం దారుణమని అన్నారు. వారి జీవనోపాధిని కాపాడే విధంగా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షాకాలం ముందు కీలక ఆదేశాలు నాలాల పూడికతీత పనులు త్వరగా పూర్తి చేయాలి. పెండింగ్‌లో ఉన్న రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మందాడి శ్రీనివాస్ రావు, తూము శ్రవణ్ కుమార్, అంబటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మొత్తంగా, నిరుపేదల జీవనోపాధి రక్షణపై ఎమ్మెల్యే గట్టిగా నిలబడి, మానవీయ కోణంలో సమస్య పరిష్కారానికి అధికారులను హెచ్చరించడం ఈ సంఘటనలో ముఖ్యాంశంగా నిలిచింది.


## క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు కంటెంట్ రైటర్లు కావలెను

### సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595



## ఫ్రైడ్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డ్ అందుకున్న కర్కనాగరాజు

**బాలానగర్, ఏప్రిల్ 22 (క్రైమ్ మిర్రర్) :** గ్రేటర్ హైదరాబాద్ కూకట్ పల్లి నియోజకవర్గం కార్మిక నాయకుడు కర్కనాగరాజుకు ఫ్రైడ్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డ్ 2026 దక్కింది. మంగళవారం ముంబై నగరంలో అంధేరి ప్రాంతంలో ఉన్న మేయర్ హాల్ ఆడిటోరియం లో ముంబై కి చెందిన జేపిటి ప్రొడక్షన్స్ సంస్థ వారు నిర్వహించిన కార్యక్రమంలో బాలీవుడ్ నటులు ముఖ్య అతిథులుగా విచ్చేసి వివిధ రంగాలలో సేవలందించిన అవార్డ్ గ్రహీతులకు అవార్డులు అందజేశారు. హైదరాబాద్ నగరం కూకట్ పల్లి నియోజకవర్గం ఐ.ఎన్ టి.యు.సి అధ్యక్షులు, గ్రేటర్ హైదరాబాద్ ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు, పి.జే.ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు కర్కనాగరాజుకు అత్యంత ప్రతిష్టాత్మకమైన ఫ్రైడ్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డ్ 2026 సామాజిక సేవా, ట్రేడ్ యూనియన్ లీడర్షిప్ కేటగిరీలో అవార్డ్ అందుకున్నారు. ఈ అవార్డును బాలీవుడ్ నటులు కమల్ గి మిరె, అభాష్ కుమార్, అంధేరీ వెస్ట్ ఎసిపి సంజయ్ పాటిల్ చేతులమీదుగా కర్కనాగరాజు అవార్డును అందుకున్నారు. కర్కనాగరాజు మాట్లాడుతూ తను చేసిన సామాజిక సేవా, ట్రేడ్ యూనియన్ రంగంలో చేసిన సేవలను గుర్తించి ఈ అవార్డు కు ఎంపిక చేసినందుకు జెపిటి ప్రొడక్షన్ సంస్థ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డుతో తన పై మరింత బాధ్యత పెరిగిందన్నారు. భవిష్యత్తులో మరింత తన సేవలను విస్తరిస్తానని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెపిటి ప్రొడక్షన్ ఛైర్మెన్ టి. జడేజా, సినీ నటులు రాజ్ ది, సురేందర్ ఠాకూర్, అభికేష్ ఖన్నా, అమిత్ జైస్వాల్, ఆరిఫ్ ఖాన్, సినీ ప్రొడ్యూసర్ గిరీష్ థాపర్, అభిజిత్ లహరి, షబీనా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు స్విమ్మింగ్‌పూల్‌లో పడిన బాలుడు చికిత్స పొందుతు మృతి



**గండిపేట(క్రైం మిర్రర్):** ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ పూల్‌లో పడిన బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నార్సింగి రాజపుష్ప ప్రోవిన్షియా అపార్ట్‌మెంట్‌లో మల్లపు దినేష్‌రెడ్డి, మానస భార్యభర్తలు వీరికి ఇద్దరు సంతానం. ఈ నెల 16వ తేదీన ఉదయం 11 గంటల సమయంలో వారి కుమారుడు రిషాన్‌రెడ్డి(మూడున్నర సంవత్సరాలు) రాజపుష్ప ప్రోవిన్షియా క్లబ్‌హౌస్ పరిధిలోని స్విమ్మింగ్ పూల్‌లో ప్రమాదవశాత్తు పడిపోవడంతో మునిగిపోయినట్లు తెలిపారు. వెంటనే బాలుడిని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని మెడికవర్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స చేయించారు. 17వ తేదీన బాలుడిని మెరుగైన చికిత్స కోసం రెయిన్‌బో ఆసుపత్రికి తలరించారు. అయినప్పటికి బాలుడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు ఇంటికి తీసుకెళ్లాలని సూచించారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు ఇంఇకి తీసుకెళ్తున్న సమయంలో బాలుడు మృతి చెందాడు. ఈ ఘటనపై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్టీసీ సమ్మె...నిర్మానుష్యంగా చౌటుప్పల్ బస్టాండు



**చౌటుప్పల్,ఏప్రిల్ 22,క్రైమ్ మిర్రర్:** తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల సమ్మె కారణంగా యాదాద్రి జిల్లా, చౌటుప్పల్ ఆర్టీసీ బస్టాండు నిర్మానుషంగా మారింది. బస్సులు డిపోలకే పరిమితం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోజువారి ప్రయాణికుల రాకపోకలతో కిటకిటలాడే చౌటుప్పల్ బస్టాండ్ ప్రాంగణం బుధవారం బంద్ కారణంగా నిశ్శబ్ద వాతావరణాన్ని సంతరించుకొని పూర్తిగా ప్రయాణికులు లేక నిర్మానుష్యంగా కనిపించింది. విద్యార్థులు, వ్యాపారవేత్తలు, అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా అత్యవసర పనుల కోసం ప్రయాణించాల్సిన వారు గమ్యస్థానాలకు చేరుకోవడం కష్టంగా మారింది. ఆర్టీసీ బస్సు సేవలు నిలిచిపోవడంతో ప్రజలు ప్రత్యామ్నాయ రవాణా మార్గాలపై ఆధారపడక తప్పలేదు. ప్రయాణికులు ఇతర ప్రైవేటు వాహనాలపై ఆధారపడడంతో ప్రయాణ ఖర్చులు పెరిగినట్లు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం బంద్ కొనసాగుతుండటంతో పరిస్థితులు ఎప్పుడు సాధారణ స్థితికి వస్తాయో అనేది అనిచితంగా మారింది. బస్సు సేవలను త్వరితగతిన పునరుద్ధరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

### ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు రాజన్న



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** రాష్ట్రపతి ఉత్తర్వులు వెంటనే రద్దుచేసి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు రాజన్న డిమాండ్ చేశారు. కల్వకుర్తి పట్టణంలోని పరిణయం ఫంక్షన్ హాల్లో మంగళవారం దళిత క్రైస్తవుల హక్కుల పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షులు గుమ్మకొండ రాజు ఆధ్వర్యంలో నియోజకవర్గ దళిత క్రైస్తవుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి నాగర్ కర్నూలు జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు పి.రాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సుప్రీం కోర్ట్ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా వర్తించదని తీర్పు వెలువరిస్తే అన్ని రాజకీయ పార్టీలు మౌనం వహించిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ దళిత క్రైస్తవులకు అండగా ఉండి పోరాడుతానని పిలుపునిచ్చారని పేర్కొన్నారు. మందకృష్ణ మాదిగ పిలుపుతో జిల్లాలో ఉన్న ఎమ్మార్పీఎస్ నాయకులు కూడా మీకు అండగా ఉంటామని తెలిపారు. దళిత సిక్కు, బౌద్ధులకు మినహాయింపు ఇచ్చినట్టే దళిత క్రైస్తవులకు న్యాయం చేయాలని అన్నారు. దళిత క్రైస్తవుల హక్కుల పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షులు గుమ్మకొండ రాజు మాట్లాడుతూ. దేశంలో క్రైస్తవం రాకముందు ఏ విధమైన వివక్ష ఉన్నదో నేటికీ అదే వివక్ష కొనసాగుతుందన్నారు. బ్రాహ్మణ, రెడ్డి, కమ్మ, వైశ్య కులస్తులు క్రైస్తవ మతంలోకి వెళ్తే సామాజిక హోదా మారినప్పుడు కేవలం దళితులకు మాత్రమే ఎందుకు హోదా మారుతుందని ప్రశ్నించారు. అందుకే దళిత క్రైస్తవులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పోరాడి ఎస్సీ హోదా సాధించుకుందామని పిలుపునిచ్చారు. దళిత క్రైస్తవులపై అమలులో ఉన్న 1950 రాష్ట్రపతి ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని లేదా వాటి పరిధి నుండి దళితులను మినహాయించాలని ఈ ఉత్తర్వులు దళితులకు రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛకు ఆర్టికల్ 14 15 25 లకు పూర్తిగా విరుద్ధమని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు తమ ఇష్టానుసారంగా మతాన్ని ఎంచుకునే హక్కు కలిగి ఉండాలని, ఇతర వర్గాలైన ఓ సి బి సి ఎస్ టి లకు లేని మత పరిమితులు కేవలం ఎస్సీలకే ఎందుకు విధిస్తున్నారు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు. 1950 రాష్ట్రపతి ఉత్తర్వులు పూర్తిగా అసమానతలను ప్రతిబింబిస్తున్నాయని, చారిత్రాత్మకంగా దళితుల విద్య ఆరోగ్య పురోగతిలో క్రైస్తవ మిషనరీలు కీలకపాత్ర పోషించిన నేపథ్యంలో మతం మారినందుకు దళితులను శిక్షించేలా ప్రభుత్వ విధానాలు ఉండకూడదని స్పష్టం చేశారు. ఏ మతంలో ఉండాలనేది వ్యక్తిగత నిర్ణయం అని దానిపై ఆంక్షలు విధించే హక్కు ఎవరికీ లేదన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఈ ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత క్రైస్తవుల హక్కుల పోరాట సమితి సభ్యులు, ఎమ్మార్పీఎస్ తాలూకా అధ్యక్షులు పర్వపాకుల శేఖర్, అరుణ్ కుమార్, యోహాన్, నందు, శ్రీకాంత్, శేఖర్, ఆనంద్, జ్యోతి ప్రసాద్, శివరాం ప్రసాద్, పాస్టర్లు లూకాస్, రామస్వామి, జేబి రాజు, సృజన్ వివిధ మండలాల పాస్టర్స్ సంఘ పెద్దలు యూత్ తదితను పాల్గొన్నారు.



## ఉప్పర్‌పల్లి చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే దిష్టిబొమ్మను దహన ం చేసిన బీజేపీ నాయకులు

**గండిపేట(క్రైం మిర్రర్):** భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పసుపుల సందీప్‌ముదిరాజ్ అధ్యక్షతన బుదవారం ఉప్పర్‌పల్లి చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేశారు. తమిళనాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా చెన్నై బహిరంగ సభలో మాట్లాడుతూ ఏఐడిఎంకే మద్దతు బీజేపీకి ఎందుకు ఇస్తుంది దక్షిణ భారతదేశానికి నరేంద్రమోడీ ఎటువంటి సహాయం చేయలేదు, మరి ప్రధానమంత్రిని టెర్రరిస్టుగా వర్ణించి అనుచిత వాఖ్యలు చేసినందుకు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మల్లికార్జున్ ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేసినట్లు తెలిపారు. బేషర్తుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ డౌన్‌డౌన్ అని నినాదాలు ఇవ్వడం జరిగింది. గతంలో కూడా కర్ణాటక ఎన్నికలలో భాగంగా మల్లికార్జున్ ఖర్గే భారతీయ జనతా పార్టీ నాయకులను విషపూరితమైనటువంటి పాములతో వర్ణించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ, గోషామహల్ జిల్లా ఇన్‌చార్జీ వై.శ్రీధర్, నారాయణఖేడ్ జిల్లా ఇన్‌చార్జీ బాల్‌రెడ్డి, మహిళా మోర్చా వనితరెడ్డి, మాజీ డివిజన్ అధ్యక్షుడు బాబురావు, శ్రీకాంత్‌రెడ్డి, బండారి బాలకృష్ణ, రజనీకాంత్‌గుప్తా, తిరుమల్లేష్, ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, పవన్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, సరితరెడ్డి, అంబికా, రాకేష్‌గౌడ్, పద్మావతి, జంగయ్య, జ్ఞానేశ్వర్, ప్రకాష్‌రెడ్డి, స్వాతి, ప్రవీణ్, బాలసాయి, నరేందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రధాని నరేంద్రమోడీపై అనుచిత వాఖ్యలు చేస్తే సహించేది లేదు

### మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీజేపీ పార్టీ నాయకుడు సురెడ్డి వినయ్‌రెడ్డి



**గండిపేట(క్రైం మిర్రర్):** దేశ ప్రధాని నరేంద్రమోడీపై అణుచిత వాఖ్యలు చేస్తే సహించేది లేదని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీజేపీ పార్టీ నాయకుడు సురెడ్డి వినయ్‌రెడ్డి స్పష్టం చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రధానమంత్రి నరేంద్రమోడీపై చేసిన వాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోని క్షమాపణ చెప్పాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీజేపీ పార్టీ నాయకుడు సురెడ్డి వినయ్‌రెడ్డి డిమాండ్ చేశారు. మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలకు నిరసనగా కాటేదాన్ చౌరస్తాలో బుధవారం ఆయన దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. మల్లికార్జున్ ఖర్గే ప్రధాన మంత్రి నరేంద్రమోడీపై చేసిన వాఖ్యలను ఖండిస్తూ ఈ నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ప్రముఖ నాయకులు ప్రజాప్రతినిధులు బాధ్యతతో మాట్లాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, జిల్లా ఇన్‌చార్జీ వెంకట్రామణగుప్తా, రావుల భాస్కర్, బొమ్మరాజు నర్సింహ్మా, నవారు మురళీధర్‌రెడ్డి, వై.నర్సురెడ్డి, గూడూరి అంజి, కొండల్, జే.ప్రేమ్, గణేష్, వేణు, శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజలకు మంచినీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

### పిఅండ్‌టి కాలనీ సోషల్ వర్క్స్ అసోసియేషన్ ప్రతినిధి బృందం

**గండిపేట(క్రైం మిర్రర్):** ప్రజలు పడుతున్న మంచినీటి ఇబ్బందులను జలమండలి అధికారులు వెంటనే పరిష్కరించాలని పిఅండ్‌టి కాలనీ సోషల్ వర్క్స్ అసోసియేషన్ ప్రతినిధి బృందం కోరారు. అధ్యక్షులు, సీనియర్ నాయకుడు సయ్యద్ ఫిరాసత్‌హుస్సేన్, ప్రధాన కార్యదర్శి హాఫీజ్‌ఖాన్, రిటైర్డ్ తహసీల్దార్ ఖుత్బుద్దీన్, రిటైర్డ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ హమేద్, అహ్మద్‌భాయ్‌లు జలమండలి జనరల్ మేనేజర్ సాయిలక్ష్మి, డిపూయటీ జనరల్ మేనేజర్ జవహర్‌లను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. పిఅండ్‌టి కాలనీ, నర్సారెడ్డి కాలనీ, ఇతర సమీప కాలనీల నివాసితులు ఎదుర్కొంటున్న తీవ్రమైన నీటి సమస్యలను వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో నీటి సరఫరాకు అంతరాయం కలగకుండా ఉండేందుకు అదనంగా 15 హెచ్పి, 10హెచ్పి మోటర్లను ఉంచాలని కోరారు. అలాగే ఈ ప్రాంతం జీహెచ్‌ఎంసీ పరిధిలోకి వస్తుంది కాబట్టి జీహెచ్‌ఎంసీ ప్రాంతాలలో అమలులో ఉన్న పద్ధతి ప్రకారం సన్‌సిటీకి కూడా ప్రత్యామ్నాయ రోజు నీటి సరఫరాను నియంత్రించాలన్నారు. జీఎం సానుకూలంగా స్పందించి, సన్‌సిటీ ప్రాంత కాలనీలకు ప్రత్యామ్నాయ రోజు నీటి సరఫరాను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లు, అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





## ప్రభుత్వం అందించే పోషక ఆహారాలను సద్వినియోగం చేసుకోవాలి: మున్సిపల్ ఛైర్మన్ బృంగి రత్నమాల

**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషక ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కల్వకుర్తి మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఐసిడిఎస్ వారు ఏర్పాటు చేసిన పోషక పక్వాడ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రభుత్వం అందించే సరుకులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ షేక్ మొహమ్మద్ వైస్ చైర్మన్ శానవాజ్ ఖాన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి కౌన్సిలర్లు షేక్ ఏజాస్ కొల్లోజు రాజేష్ కుమార్ రామకృష్ణ నాయకులు రమాకాంత్ రెడ్డి కోడెల గణేష్ చిత్తరి శ్రీను ఐసిడిఎస్ అధికారులు, అంగన్వాడి టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ఉపాధి హామీ కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజు కూలీ 800 రూపాయలు ఇవ్వాలి

### ఈ - కేవైసీని ఎత్తివేయాలి.. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా డిమాండ్



**మోటకొండూర్, ఏప్రిల్ 22(క్రైమ్ మిర్రర్):** ఉపాధి హామీలో పనిచేస్తున్న కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజు కూలీ 800 రూపాయలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనికి కార్మికులను దూరం చేసే ఈ కేవైసీని వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వానికి వారు సూచించినారు. బుధవారం మోటకొండూర్ మండల పరిధిలోని ఆరెగూడెం గ్రామంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సందర్శించి వారి సమస్యలను తెలుసుకున్న అనంతరం నర్సింహ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పనిస్తున్న కూలీలకు రోజు కూలీ ఎంతనో కూడా తెలియని అయోమయ పరిస్థితులలో ఉన్నారని, రోజు కూలీ ఎంతనో తెలియజేసే పే స్లిప్పులు ఇవ్వడం లేదని అన్నారు. ఇప్పటికైనా వారం వారం కూలీలకు పే స్లిప్పులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూలీలను అడిగినప్పుడు 150 నుంచి 200 రూపాయలు ఇస్తున్నారని చెప్తున్నారని మరి ప్రభుత్వం నిర్ణయించిన 307 రూపాయలన్నా ఇవ్వాలి కదా అని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ - కేవైసీ వల్ల చాలామంది కూలీలు ఉపాధికి దూరమవుతున్నారనీ వెంటనే ఉపాధి హామీ ఈ- కేవైసీ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో మౌలిక వసతులను కల్పించి, ప్రమాద బీమా సౌకర్యం కూడా కూలీలకు అమలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. కల్లుగీత కార్మిక జిల్లా ప్రధాన కార్యదర్శి బొలగాని జయరాములు మాట్లాడుతూ మోటకొండూరు మండలం సాగునీరు వసతి లేక వ్యవసాయం లేక చాలామంది వ్యవసాయ కూలీలకు ఉపాధి దొరకడం లేదని ప్రభుత్వము కనీసం ఉపాధి హామీలో 200 రోజుల పని దినాలు కల్పించి అందరికీ పని కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం భూమిలేని పేదలకు 12 వేల రూపాయలు ఇస్తానన్న హామీని కూడా అమలు చేయాలని కోరారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగిస్తూ మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన విబి-జి రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు కొల్లూరు ఆంజనేయులు, టెక్నికల్ అసిస్టెంట్ ఏ. మంగ , మేటు హరిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం కొల్లూరి శ్రీహరి, సుధాకర్, రమేష్, నాగరాజ్, గాదుల శ్రీను, సత్యలక్ష్మి, జ్యోతి, అశ్విని, గణేష్ పద్మ, రజిని, సరిత, దివ్య, మల్లేష్ జహంగీర్, మల్లయ్య, నరసింహులు, బాల నరసింహ, మానస, లక్ష్మి, అఖిల, భాగ్యలక్ష్మి బాలమణి, లింగమ్మ, మల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలి

### మణికొండ బీఆర్ఎస్ పార్టీ నాయకులు

**గండిపేట(క్రైం మిర్రర్):** స్వర్గీయ పట్లోళ్ల ఇంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా కౌకుంట్లకు వెళ్లే ముందు భారత రాష్ట్ర సమితి పార్టీ మణికొండ నాయకులు నెక్నాంపూర పాఠశాల వద్ద ఆయన ఆత్మకు శాంతికై ఒక నిమిషం మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. మణికొండ బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. రాష్ట్ర అంసెబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ రోడ్డు రవాణా సంస్థ కార్పొరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేస్తామని, ప్రబుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు ఇస్తామని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని, రిటైర్మెంట్ ప్రయోజనాలను తక్షణం అందిస్తామని, ప్రైవేటీకరణకు పాల్పడబోమని, డ్రైవర్లు, కండక్టర్ల నియామకాలు చేపడతామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. కానీ రెండున్నర సంవత్సరాలు గడిచినను ఇట్టి హామీలలో ఎలాంటి పురోగతి కనిపించడం లేదన్నారు. అంతేకాక మార్చి 13 న సమ్మె చేస్తామని నోటీసు ఇచ్చినప్పటికీ నిన్నటి వరకు లేబర్ కమిషనర్ గానీ, ప్రభుత్వం గానీ చర్చలు ప్రారంభించేందుకు ముందుకు రాక పోవడం ప్రభుత్వం రోడ్డు రవాణా సంస్థ కార్పొరేషన్ ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపిస్తున్నదన్నారు. ఇప్పుడు కమిటీ ఏర్పాటు చేసి సమస్యలను పరిశీలిస్తామని చెప్పడం కేవలం కాల యాపన చర్య మాత్రమేన్నారు. ప్రజా ప్రణాళికలు లేవు, ఉద్యోగుల సంక్షేమంపై దృష్టి లేదన్నారు. గండిపేట ప్రాంతంలోని రోడ్డు రవాణా సంస్థ కార్పొరేషన్ ఉద్యోగు లందరికీ మణికొండ బీ.ఆర్.ఎస్ పార్టీ తన పూర్తి మద్దతును తెలియజేస్తూ వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోందన్నారు. తదనంతరం కౌకుంట్ల గ్రామానికి వెళ్లి స్వర్గీయ పట్లోల్ల ఇంద్రారెడ్డి సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో మణికొండ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు సీతారం ధూళిపాళ, గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాద్ రెడ్డి, అందె లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, యాలాల కిరణ్, భాను చందర్, జైరామ్, షేక్ ఆరిఫ్ మొహమ్మద్, సుమనళిని, బాబు రావు, శ్రీనివాస్, శివ, తిరుపతి, నూకల మంజు, శ్యామలేట్ రేఖ, శ్రీను తది తరులు పాల్గొన్నారు.



## ప్రజా పాలన పురోగతి ప్రణాళిక కార్యక్రమం యాచకుల సర్వే నివేదిక

గండిపేట(క్రైం మిర్రర్): ప్రజా పాలన పురోగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాజేంద్రనగర్ పరిధిలోని ఆరాంఘర్ జంక్షన్ వద్ద గ్రేస్ ఎన్జీఓ ఆధ్వర్యంలో యాచకులు, షెల్టర్ లెస్ వ్యక్తుల సర్వే నిర్వహించరు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ పోలీసులు, యూసీడీ సిబ్బంది కలిసి పాల్గొన్నారు. సర్వేలో మొత్తం 8 మందిని గుర్తించి షెల్టర్ హోంకు తరలించరు. మిగతా వ్యక్తులను వారి స్వస్థలాలకు పంపించే చర్యలు తీసుకన్నారు. ఈ కార్యక్రమంలో డీఓ స్వాతి, సీఓ లక్ష్మణ్, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ సీఐ, వెంకటేష్ (కేర్ టేకర్) తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా నిరాశ్రయుల సంక్షేమానికి మరియు యాచకత్వ నిర్మూలనకు కీలకమైన చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.



## శంషాబాద్ లో 9 ఎకరాలను కాపాడిన హైడ్రా

### రూ. 90 కోట్ల విలువైన భూమికి హైడ్రా ఫెన్సింగ్






**గండిపేట(క్రైం మిర్రర్):** శంషాబాద్ లో ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా బుధవారం కాపాడింది. దీని విలువ రూ. 90 కోట్లకు పైగా ఉంటుందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. సర్వే నంబర్ 626/2లో మొత్తం 176.05 ఎకరాల ప్రభుత్వ భూమి రెవెన్యూ రికార్డుల ప్రకారం ఉంది. అటవీ అభివృద్ధి సంస్థకు 166 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. ఇంకా అక్కడ 9.05 ఎకరాల ప్రభుత్వ భూమి మిగిలింది. ఖస్రా పహాణీ( గ్రామ పాత రికార్డుల) ప్రకారం మొత్తం 176.05 ప్రభుత్వ భూమిగా రికార్డుల్లో నమోదైంది. ఇందులోని 9.05 ఎకరాలను సీఎస్ 14 (నిజాంలకు చెందిన) భూములుగా పేర్కొంటూ కొంతమంది హక్కులు క్లైమ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూమి అంటూ రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. మొత్తానికి ఈ వివాదం హైకోర్టులో పెండింగ్ ఉంది. తుది తీర్పు వచ్చే వరకూ ఈ భూమి స్వరూపాన్ని మార్చరాదని, అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని హైకోర్టు స్టే ఇచ్చింది. స్టేటస్ కో ఆర్డర్‌ను పట్టించుకోకుండా తజమ్ముల్ మొయినుద్దీన్ ఖాన్ అనే వ్యక్తి ఆ భూమిని చదును చేసి లే ఔట్‌గా మార్చినట్టు రంగరెడ్డి కలెక్టర్‌తో పాటు శంషాబాద్ మున్సిపల్ అధికారులకు ప్రజావాణిలో ఫిర్యాదులందాయి. క్షేత్ర స్థాయిలో పరిశీలించగా.. తజమ్ముల్ మొయినుద్దీన్ ఖాన్ 9.05 ఎకరాల భూమిని చదును చేసి ప్రీకాస్ట్ గోడల ద్వారా ఆక్రమించినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. భూ ఆక్రమణ చట్టం 1905 ప్రకారం ఆక్రమణలను తొలగించాలని మొయినుద్దీన్‌కు సూచించారు. ఇవేవీ పట్టించుకోకుండా అక్కడ కొన్ని ఇంటి స్థలాలు అమ్ముకున్నట్టు కూడా తెలుసుకున్నారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఇదే విషయాన్ని హైడ్రాకు చెబుతూ ఆక్రమణలు తొలగించాలని లేఖ రాశారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారుల ఫిర్యాదుతో బుధవారం హైడ్రా ఈ ఆపరేషన్ చేపట్టి 9.05 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను తొలగించింది. చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారుల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసింది.

## హైదర్‌గూడ చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో మల్లికార్జున ఖర్గే దిష్టిబొమ్మ దహనం



**గండిపేట(క్రైం మిర్రర్):** అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ చౌరస్తాలో ప్రధాని నరేంద్రమోడీపై అనుచిత వాఖ్యలు చేసిన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేశబ్బూరు. అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు సులిగే వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కొమురయ్యలు పాల్గొని మాట్లాడుతూ ఖర్గే గతంలో కూడా హిందువుల మనోభావాలు దెబ్బతీసేటట్లు మాట్లాడారన్నారు. ఈసారి ప్రధాని నరేంద్రమోడీపై అనుచిత వాఖ్యలు చేసిన ఖార్గే క్షమాపణ చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ విజయ్, కిరణ్, జి.రాజు, వెంకట్‌రెడ్డి, శశికాంత్‌శర్మ, విజయస్వామి, అమర్‌నాథ్‌రెడ్డి, ముఖేష్, శ్రీను, సంతోష్, బాలకృష్ణ, వెంకటేష్, రవీందర్‌రెడ్డి, పి.సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్వర్గీయ ఇంద్రారెడ్డి సేవలు చిరస్మరనీయం

### నార్సింగి సర్కిల్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి



**గండిపేట(క్రైం మిర్రర్):** నార్సింగి సర్కిల్ పరిధిలోని గండిపేట చౌరస్తాలో మాజీ మంత్రి స్వర్గీయ పి.ఇంద్రారెడ్డి 24వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నార్సింగి సర్కిల్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. పేదల పెన్నిధిగా, ప్రజా నాయకుడిగా ఇంద్రారెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంత్రిగా ఆయన అందించిన సేవలను, నియోజకవర్గ అభివృద్ధికి ఆయన పడ్డ తపనను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ మైనారిటీ అధ్యక్షుడు ముక్తార్, గండిపేట్ మాజీ సర్పంచ్ ప్రశాంత్ యాదవ్, మాజీ సర్పంచ్ అశోక్, గణేష్ ముదిరాజ్, శ్రీకాంత్ రెడ్డి, రవి యాదవ్, వెంకటేష్, గణేష్ రెడ్డి, మల్లేష్, చిరంజీవి, నరసింహ, విష్ణువర్ధన్, మహమూద్ భాయ్, యాదగిరి, లక్ష్మీ, జెసిమ, మహిళా అధ్యక్షురాలు ఆసిన్, విష్ణు, శ్రీకాంత్ రెడ్డి, రాజు, రాజేష్, సాయి, సంతోష్, రాజు, విక్రమ్, శ్రీమన్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ఎర్త్ డే సందర్భంగా సైకిల్ ర్యాలీ నిర్వహించిన ఆరెగూడెం ఉన్నత పాఠశాల విద్యార్థులు

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** అంతర్జాతీయ ఎర్త్ డే పురస్కరించుకుని, "99 రోజుల ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా ఆరెగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, యువత పాల్గొని సైకిల్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, కాలుష్య నియంత్రణలో భాగంగా సైక్లింగ్ వంటి పర్యావరణ హిత మార్గాలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు "భూమిని కాపాడుకుందాం", "ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిద్దాం", "పచ్చదనం పెంచుదాం" వంటి నినాదాలతో ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నేషనల్ గ్రీన్ కాప్స్ జిల్లా కోఆర్డి ఇనుముల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంతర్జాతీయ ఎర్త్ డే జరుపుకోవాల్సిన అవసరాన్ని విద్యార్థులకు వివరించారు భూమిని సంరక్షించడం మనందరి బాధ్యత చిన్నచిన్న చర్యల ద్వారా కూడా పర్యావరణాన్ని కాపాడవచ్చని , ప్రకృతిని మనం కాపాడితే అదే మనల్ని కాపాడుతుంది అనే నినాదంతో తరువాతి తరాల కోసం పచ్చని స్వచ్ఛమైన భూమిని అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మరియు గాలి నీరు నింగి నిప్పు నేల అనే



పంచభూతాల వల్లే మానవ మనుగడ సాధ్యమవుతుందని వీటిలో ఏ ఒక్కటి లోపించినా జీవనం అస్తవ్యస్తమౌతుంది కాబట్టి భూమిపై ఉన్న అన్ని వనరులు సక్రమంగా ఉంటేనే మానవ మనుగడ అభివృద్ధికి ఎటువంటి అవాంతరాలు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బసవేశ్వర రావు వెంకన్న నాగుల మీరా శైలజ తారాబేగం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మెబాట.. ప్రయాణికుల తీవ్ర ఇక్కట్లు

## ఆర్టీసీ డిపోలో ఎక్కడికి అక్కడే నిలిచిపోయిన బస్సులు





**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** ఆర్టీసీ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేపట్టడంతో ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. సమస్యలు పరిష్కరించాలంటూ ప్రభుత్వంతో మంగళవారం జరిగిన చర్చలు విఫలం కావడంతో అర్ధరాత్రి నుంచే ఆర్టీసీ కార్మికులు బస్సులను నిలిపివేశారు. కల్వకుర్తి ఆర్టీసీ డిపోలో బస్సులు నిలిచిపోయాయి ఆర్టీసీ కార్మికులు గేటు ముందు బైఠాయించారు. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని తేల్చి చెప్పారు. దీంతో బస్సులన్నీ డిపోలకే పరిమితం అయ్యాయి. ముందస్తు చర్యగా పోలీసులు డిపోలో మోహరించారు. ఇదిలా ఉండగా పోలీసుల సహకారంతో ఆర్టీసీ అధికారులు ప్రైవేట్ డ్రైవర్ కండక్టర్లతో బస్సులు బయటికి తీయడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులకు ఆర్టీసీ కార్మికులకు మధ్య తోపులాట జరిగింది బస్సులు బయటికి వెళ్లకుండా ఆర్టీసీ కార్మికులు అడ్డుకున్నారు. ఆర్టీసీ బస్సులు నడవకపోవడంతో ప్రజలు కల్వకుర్తిలో ఉదయం నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. కాగా, ఎన్నికల వేళ కాంగ్రెస్ ఇచ్చిన 32 హామీలను నెరవేర్చాలని ఆర్టీసీ కార్మికులు భీష్మించు కూర్చున్నారు.



# పెండింగ్‌లో ఉన్న శ్మశానవాటిక, సీసీ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలి

### రాజేంద్రనగర్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి

**గండిపేట(క్రైం మిర్రర్):** శ్మశానవాటికల అభివృద్ధి అధికారులు చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి కోరారు. అత్తాపూర్ సర్కిల్ మున్సిపల్ కార్యాలయంలో డీసీ మల్లయ్య, ఈఈలను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఉప్పర్‌పల్లి, ఎర్రబోడ, గగన్‌పహాడ్ గ్రామాలలో ఉన్న శ్మశానవాటిక, కొద్ది రోజుల ముందు మంజూరైన రోడ్డు పనులు ఇప్పటి వరకు టెండర్ పూర్తి కాలేదన్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో వారు సానుకూలంగా స్పందించారన్నారు. వారం రోజుల్లో పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎర్రోల యాదయ్య, దుర్గేష్, గిరిబాబు, నగేష్, ఉదయ్‌గౌడ్, గౌతమ్, విజయ్, రవి, హనుమాన్, ఈశ్వరయ్య, అజయ్, శ్రీనివాస్, లక్ష్మీ, నీరజ్ తదితరులు పాల్గొన్నారు.

# కూకట్ పల్లి లో డ్రగ్స్ తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



**కూకట్ పల్లి, ఏప్రిల్ 22 (క్రైమ్ మిర్రర్):** కూకట్ పల్లి ఫోరం మాల్ సమీపంలోని తొమ్మిదవ ఫేస్ రోడ్డు వద్ద ఎక్సైజ్ పోలీసులు జరిపిన తనిఖీల్లో డ్రగ్స్ తరలిస్తున్న వ్యక్తి పట్టుబడ్డాడు. అనుమానాస్పదంగా ద్విచక్ర వాహనం పై వెళ్తున్న కోటేశ్వరరావును ఆపి తనిఖీ చేయగా అతని వద్ద ఆరు గ్రాముల హెరాయిన్ లభ్యమైనది. పోలీసులు నిందితుడి నుంచి ఏపీ 07 బి సి 5767 నెంబర్ గల బైకు, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు.

# భర్తతో గొడవపడి ఇంట్లో నుంచి కూతురిని తీసుకొని బయటికి వెళ్లిపోయిన భార్య

**ఎల్బీనగర్ ఏప్రిల్ 22 క్రైమ్ మిర్రర్ ప్రతినిధి :** వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీలో నివాసం ఉంటున్న జూపల్లి రాజు కుటుంబం. మంగళవారం రోజు జూపల్లి రాజు, ఆయన భార్య జూపల్లి రాజ్యలక్ష్మి కి మధ్య వాగ్వాదం జరిగింది. అదే రోజు రాత్రి 12 గంటల సమయంలో తన కూతురు చిర్వి (12 సంవత్సరాలు) ను తీసుకొని ఇంటి నుండి బయటికి వెళ్ళింది. బుధవారం వరకు తిరిగి రాకపోగా జూపల్లి రాజు వనస్థలిపురం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# పర్యావరణ పరిరక్షణే మానవాళి మనుగడకు భద్రత

### నేలకొండపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి

### ఘనంగా ప్రపంచ ధరిత్రి దినోత్సవం

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** పర్యావరణ పరిరక్షణే ప్రపంచ మానవాళి మనుగడకు భద్రతను కల్పిస్తుందని నేలకొండపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి అన్నారు బుధవారం స్థానిక ప్రాథమిక ఉన్నత పాఠశాల యందుగ్రీన్ వే ఎన్విరాన్మెంటల్ సొసైటీ ఆధ్వర్యంలో 56వ ప్రపంచ దరిత్రి దినోత్సవాన్ని విద్యార్థులు ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా మారిన మానవ జీవన విధానాలు వస్తున్న వాతావరణ మార్పుల వల్ల మానవాళి మనుగుడికి తీవ్ర ముప్పు వాటిల్లో పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తు తరాలు బాగుండాలంటే పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా పెరిగిన గ్లోబల్ వార్మింగ్ వాతావరణ కాలుష్యంతో మనిషి జీవనాధారమైన ధరిత్రికి తీవ్ర ప్రమాదం ఏర్పడుతుందన్నారు. పెరిగిన వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ప్లాస్టిక్ వాడకని పూర్తిగా నిషేధించాలని, విధిగా మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంచాలని, సహజ వనరులను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని, పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. భూమికి కలిగే ముప్పును సమిష్టిగా ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రీనవే ఎన్విరాన్మెంటల్ సొసైటీ అధ్యక్షులు డి రవి కుమార్,



దరిత్రి దినోత్సవము యొక్క అవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమములో గ్రామపంచాయతీ 8వ, వార్డు మెంబెర్ వంగవీటి పవన్ కుమార్, పాఠశాల ఇంచార్జ్ గోవిందరెడ్డి, అధ్యాపకులు అధిశేషులు, బి రవి, శంకర్, పద్మజ, నాన్ టీచింగ్ స్టాఫ్ సత్యనారాయణ విద్యార్థులు పాల్గొన్నారు.

# దామెరలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**చౌటుప్పల్, ఏప్రిల్ 22, క్రైమ్ మిర్రర్ :** చౌటుప్పల్ మండలం, దామెర ఐకెపి, చౌటుప్పల్, మల్కాపురం ఐకెపి వద్ద కొనుగోలు సెంటర్లను వ్యవసాయ మార్కెటింగ్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి,మున్సిపల్ చైర్ పర్సన్ మోగదాల పావని రమేష్ గౌడ్, ఎమ్మార్వో వీరా భాయి లచే బుధవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దామెర సర్పంచ్ శ్రీధర్ రావు, వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు, చౌటుప్పల్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ వినయ్ కుమార్, మార్కెటింగ్ డైరెక్టర్లు , మల్కాపురం సర్పంచ్ నిరంజన్ గౌడ్ , చౌటుప్పల్ అగ్రికల్చర్ ఆఫీసర్ ఏపిఎం యాదయ్య, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అలివేలు, కార్యదర్శి శంకరమ్మ,సీసీలు , ఆయా గ్రామాల రైతులు ,మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





# కేసీఆర్ సభతో కాంగ్రెస్ లో వణుకు

### కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల్ని మోసం చేసింది

### బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు పెరుమళ్ళ సతీష్

**క్రైమ్ మిర్రర్,హుజూర్ నగర్(పాలకీడు):** కెసిఆర్ జగిత్యాలలో జరిగిన భారీ బహిరంగ సభ తోటి కాంగ్రెస్ పార్టీ నాయకుల పతనం మొదలైందని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు పెరుమళ్ళ సతీష్ అన్నారు . బుధవారం పాలకీడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రెండేళ్లలో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిన తీరును కేసీఆర్ చాలా స్పష్టంగా వివరించడం జరిగిందని అన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలతోటి నిండా ముంచిందని కెసిఆర్ చెప్పిన తీరుకు ప్రజలందరికీ కూడా అర్థమైంది అని మండిపడ్డారు. ఈ అసమర్ధ నాయకుల చేతుల్లో బందీ అయిన తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని మళ్లీ కెసిఆర్ చేతుల్లో పెడితేనే ఈ తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు పోతుంది అని మాట్లాడారు. కెసిఆర్ సభ తోటి తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలందరూ కూడా చాలా చైతన్యవంతులు అయినారని ఈ కాంగ్రెస్ పార్టీని గద్దెదించగలడానికి ప్రజలందరూ సంసిద్ధంగా ఉన్నారు అని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో హరి నాయక్ ,వీరబాబు, రమేష్ ,హనుమంతు ,నరేష్ , మురళి తదితరులు పాల్గొన్నారు.

# అలుగునూర్ ప్రాథమిక పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే

**నూతనకల్ (క్రైమ్ మిర్రర్):** అలుగునూర్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం లో గ్రామ సర్పంచ్ కాస నరేందర్ సౌజన్యంతో గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ ,విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కాసా నరేందర్ యాదవ్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అదేవిధంగా జిల్లా ,రాష్ట్ర స్థాయిలో మన పాఠశాల పేరు రావడం చాలా గర్వకారణం అని ఉపాధ్యాయ సిబ్బందిని అభినందించారు. అదేవిధంగా కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు శివయ్య మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులకు నవోదయ మరియు గురుకుల సీట్లు రావడం ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు అని అన్నారు. ఈనాటి కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ గోరెంట్ల వెంకన్న ,ఇటికాల ప్రసాద్ ప్రధానోపాధ్యాయులు ఉప్పు నాగయ్య పాఠశాల సిబ్బంది



నారబోయిన నాగేశ్వరరావు ,లింగాల శ్రీనివాస్,పట్టేటి రేణుక , అంగన్వాడి టీచర్ శ్రీలత,సిఆర్పీ రవీందర్,పడిదల మల్లయ్య,కాస శ్రీనివాస్,పోడేటి సతీష్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రతిపక్షాల విమర్శల్లో వాస్తవం లేదు : మంత్రి పొంగులేటి

## ఖమ్మం క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ




**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శల్లో అర్థం లేదని, ఈ ప్రభుత్వం ఏ ఒక్క పథకాన్ని నిలిపివేసిందో వారు సమాధానం చెప్పాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో నగరం 1, 59, 60 డివిజన్లకు చెందిన 27 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ, గత ప్రభుత్వంలో ప్రారంభించిన మంచి పథకాలను కొనసాగిస్తూనే.. కొత్తగా ఆరు గ్యారంటీల హామీలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమ ఫలాలను నేరుగా పేదల గడప వద్దకే చేరుస్తున్నామని మంత్రి తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం రూ. 500లకే గ్యాస్ సిలిండర్, ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ రూ.2 లక్షల రుణమాఫీ వంటి కీలక నిర్ణయాలతో ప్రజలకు అండగా ఉంటున్నామన్నారు. గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వకుండా పేదలను మోసం చేసిందని, తమ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు అందిస్తోందని చెప్పారు.ఇళ్ల నిర్మాణ విషయంలో గత ప్రభుత్వం పేదలకు కేవలం అబద్ధపు హామీలే ఇచ్చిందని మంత్రి విమర్శించారు. తమ ప్రభుత్వం తొలి దశలోనే 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని, త్వరలోనే రెండో విడత ప్రక్రియ ప్రారంభిస్తామని వెల్లడించారు. రాజకీయాలు, పార్టీలతో సంబంధం లేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేరుస్తామని హామీ ఇచ్చారు.ప్రభుత్వం విద్య, ఆరోగ్య రంగాలకు పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగానే అంతర్జాతీయ ప్రమాణాలతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్' నిర్మిస్తున్నామని మంత్రి వివరించారు. విద్యార్థుల సంక్షేమం కోసం డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మొటిక్ ఛార్జీలను 200 శాతం పెంచినట్లు గుర్తుచేశారు. ఇటీవల ఎన్నికల్లో ప్రజలు ప్రతిపక్షాలకు తగిన సమాధానం చెప్పారని ఇప్పటికైనా నిరాధార ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం మేయర్ పూనుకొల్లు నీరజ , ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ అనిత, ప్రత్యేక అధికారి రమేష్, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ జయచందర్ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడీ కేంద్రాల్లో వినూత్న కార్యక్రమాలు

**నూతనకల్ (క్రైమ్ మిర్రర్) :** మండల పరిధిలోని చిల్పకుంట్ల తాళ్ల సింగారం అంగన్వాడి కేంద్రాలలో పోషణ పక్వాడలో భాగముగా గ్రాడ్యుయేషన్ డే అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. చిల్పకుంట్లలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ అంజపల్లి నరసమ్మ, సిడిపిఓ శ్రీవాణి పాల్గొని మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలలో పౌష్టికాహారంతో పాటు పిల్లలకు ఆటలు పాటలు గేయాలతో వినూత్న రీతిలో విద్యాబోధన జరుగుతుందని తెలిపారు. తల్లిదండ్రులు ఆరు సంవత్సరాల లోపు పిల్లలందరినీ అంగన్వాడి కేంద్రాలకు పంపాలని సూచించారు. ఈనాటి కార్యక్రమంలో ఏసీడిపివో సాయి గీత , సూపర్వైజర్ సూర్య కళ, అంగన్వాడీ టీచర్స్ అన్నపూర్ణ , బత్తుల రేణుక,సైరెడ్డి రమణ, ఇందిర , సునీత, యాదమ్మ ఆయాలు పాల్గొన్నారు

## నీలగిరి తోటలో అగ్ని ప్రమాదం.. అప్రమత్తంగా స్పందించిన పోలీసులు



**రామకృష్ణాపూర్,ఏప్రిల్ 22 (క్రైమ్ మిర్రర్):** రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 13వ వార్డులో బాయ్స్ హై స్కూల్ వెనుక ఉన్న నీలగిరి తోటలో బుధవారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది.రాత్రి సుమారు 8:30 గంటల సమయంలో మంటలు చెలరేగడంతో పరిసర ప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు.స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకున్నారు.మున్సిపల్ సిబ్బంది, స్థానికుల సహకారంతో మంటలను అదుపులోకి తెచ్చారు.వేగంగా స్పందించడం వల్ల పెద్ద ప్రమాదం తప్పింది.ఈ సందర్భంగా ఎస్సై జె. శ్రీధర్ మాట్లాడుతూ, ప్రమాద సమయంలో సహకరించిన స్థానిక ప్రజలు,మున్సిపల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.అప్రమత్తతతో వ్యవహరించడం వల్ల మంటలు మరింత విస్తరించకుండా నిలువరించగలిగామని పేర్కొన్నారు.

## ఆర్టీసీ కార్మికులు సమ్మెను శాంతియుతంగా నిర్వహించుకోవాలి

### బస్సులు, ప్రభుత్వ ఆస్తులపై దాడులు చేస్తే సహించేది లేదు

### అట్టి వ్యక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవు

### చట్టానికి లోబడి నడుచుకోవాలి.. : జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్




సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఏప్రిల్ 22: రాష్ట్రంలో జరుగుతున్న ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. సమ్మె పూర్తిగా శాంతియుత వాతావరణంలోనే నిర్వహించుకోవాలని, కార్మికులు తమ వినతులను సంబంధిత ఉన్నతాధికారులకు తెలియజేయాలే కానీ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదు అన్నారు. సమ్మె కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు మరియు అత్యవసర సేవలు వినియోగించే ప్రజలు ఇబ్బంది పడకుండా ట్రాఫిక్ మరియు రవాణా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎస్పీ పేర్కొన్నారు.ప్రైవేట్ డ్రైవర్లు తాత్కాలికంగా విధుల్లోకి వచ్చినా, ఆర్టీసీ డ్రైవర్లు తిరిగి విధుల్లో చేరినా, వారికి ఎటువంటి బెదిరింపులు లేకుండా పూర్తి భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆర్టీసీ బస్సులు నడపడానికి అర్హత కలిగిన డ్రైవర్లు ముందుకు రావాలని సూచించారు. ఆసక్తి ఉన్న డ్రైవర్లు జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ నంబర్ 8712656739కు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులకు నష్టం కలిగించినా, అధికారులపై దాడులకు పాల్పడినా, అలాంటి వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బస్సులు, ఇతర ప్రభుత్వ ఆస్తులపై దాడులు చేసి సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అందరు చట్టానికి లోబడి వ్యవహరించాలని సూచించారు.సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం, వదంతులు వ్యాప్తి చేసే వారిపై కూడా జిల్లా పోలీసు కార్యాలయం నుండి పర్యవేక్షణ కొనసాగుతోందని, అట్టి వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమ్మెలో పాల్గొనే కార్మికులు, ప్రజలు పరస్పర గౌరవంతో వ్యవహరించి, ఎలాంటి ఉద్రిక్తతలకు తావు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల శాంతి భద్రతలను కాపాడటంలో పోలీస్ శాఖకు సహకరించాలని, ఎక్కడైనా అనుమానాస్పద పరిస్థితులు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు.

## వేసవి వేళ రామ సహాయం

### 44 గ్రామాల్లో తాగునీటి కష్టాలకు ఎంపీ రఘురాం రెడ్డి చెక్

### రూ.35 లక్షల నిధులతో ప్రజల దాహార్తి తీర్చేందుకు చర్యలు

### వారం రోజుల్లోనే పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** వేసవిలో భానుడు భగభగలాడుతుండటంతో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల (వీూూణూ) నుంచి రూ.35 లక్షలు మంజూరు చేస్తూ తక్షణ చర్యలకు శ్రీకారం చుట్టారు.

**దప్పిక తీర్చే 'ఎంపీ లాడ్స్':**

జిల్లాలోని సత్తుపల్లి, మధిర, వైరా, పాలేరు నియోజకవర్గాలోని 44 గ్రామాల్లో రూ. 35,20,000 నిధులతో కొత్తగా చేతిపంపులను ఏర్పాటు చేయించనున్నారు. ముఖ్యంగా శివారు ప్రాంతాలు, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నీటి సమస్య పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయగా.. ఇప్పటికే కొన్ని ప్రారంభమయ్యాయి. దీనివల్ల వృద్ధులు, మహిళలకు దూర ప్రాంతాల నుంచి నీళ్లు తెచ్చుకునే కష్టాలు తప్పనున్నాయి.

**వారం రోజుల్లోనే పనులు పూర్తి కావాలి..**

నిధుల అనుమతులు మంజూరైన నేపథ్యంలో పనులను పట్టాలెక్కించాలని ఎంపీ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆర్ డబ్ల్యూఎస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.? తాగునీటి సమస్య తీవ్రతను గుర్తించి తక్షణమే నిధులు కేటాయించినందుకు స్థానిక సర్పంచ్ లు ప్రజలు ఎంపీ రఘురాం రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

### సర్పంచ్ సురకంటి లావణ్య మధుసూదన్ రెడ్డి



**నూతనకల్ ( క్రైమ్ మిర్రర్):** ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని సర్పంచ్ సురకంటి లావణ్య మధుసూదన్ రెడ్డి అన్నారు.బుధవారం బడిబాటలో భాగంగా ప్రాథమిక పాఠశాల పెదనెమిల లో విద్యార్థులకు ప్రగతి నమోదు పత్రాలను సర్పంచ్ సురకంటి లావణ్య మధుసూదన్ రెడ్డి అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే అన్ని రకాలైన వసతులతో కూడిన నాణ్యమైన విద్య అందించడంతోపాటు పోషకాలు ఉన్న మధ్యాహ్న భోజనం, రాగిజావ అందించడం జరుగుతుందని తెలిపారు. తల్లిదండ్రులపై ఎలాంటి ఫీజుల భారం లేకుండా తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలకే పంపించి మన ఊరు బడిని రక్షించే బాధ్యత మన అందరి పైన ఉంది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వల్లమల్ల నరేష్, ప్రధానోపాధ్యాయురాలు నీరజ సహోపాధ్యాయులు బొజ్జ కెనడీ,చంద్రశేఖర్ రెడ్డి,రజిత విద్యార్థులు పాల్గొన్నారు.

## తాళ్ల సింగారంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**చౌటుప్పల్, ఏప్రిల్ 22,క్రైమ్ మిర్రర్ :** చౌటుప్పల్ మండలం, తలసింగారం గ్రామంలో పిఏసిఎస్ చౌటుప్పల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ లు ముఖ్య అతిథులుగా పాల్గొని వారి చేతుల మీదుగా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతులు ఓరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వరి ధాన్యానికి ప్రభుత్వం 500 రూపాయల బోనస్ చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొసనం రాకేష్ రెడ్డి, పోలేపల్లి లక్ష్మీ ముత్తయ్య, మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు, ఏఈఓ ఉమామహేశ్వరి, ఏఎంసి డైరెక్టర్ పబ్బు శ్రీకాంత్ గౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కొరగాని లింగస్వామి, మాజీ సింగిల్ విండో వైస్ చైర్మన్ చెన్నగొని అంజయ్య గౌడ్, సుర్వి నరసింహా గౌడ్, కనకా రెడ్డి, ముత్తయ్య, శివకృష్ణ, సుధాకర్, శ్రీనివాస్ రెడ్డి, రైతులు సంఘ కార్యదర్శి వై రమేష్, కొనుగోలు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా రక్షణ, శాంతి భద్రతకే ప్రాధాన్యం

### ఆర్టీసీ సమ్మె సమయంలో హింసకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు....

### ఉద్యోగం కోసం వచ్చే డ్రైవర్లు, కండక్టర్లకు పూర్తి భద్రత

### సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహ

**క్రైమ్ మిర్రర్, సూర్యాపేట :** తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో సూర్యాపేట జిల్లా పరిధిలో శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా దాడులు, బెదిరింపులకు పాల్పడితే అలాంటి వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.సమ్మె సమయంలో విధుల్లో చేరేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్న ప్రైవేట్ డ్రైవర్లు, కండక్టర్లు, అలాగే బస్సుల యజమానులను లక్ష్యంగా చేసుకుని ఎవరైనా దాడులు చేయడం, బెదిరింపులకు పాల్పడడం, ఇళ్లపై దౌర్జన్యాలకు దిగడం వంటి ఘటనలను పోలీసులు అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి చర్యలు చట్ట విరుద్ధమని, ఇలాంటి సంఘటనలు పాల్పడితే కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించబడతారని హెచ్చరించారు.ప్రజలు ఎవరూ భయపడకుండా తమ విధులు నిర్వర్తించాలనీ, ఉద్యోగం కోసం వచ్చే వారికి పూర్తి రక్షణ కల్పిస్తామని పోలీసులు భరోసా ఇచ్చారు. ఎవరైనా బెదిరింపులు, దాడులకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.అత్యవసర సహాయం కోసం రామగుండం పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్: 8712686026, డయల్ 100 కాల్ సమాచారం ఇవ్వాలని అని తెలిపారు. పోలీసులు ఎల్లప్పుడూ ప్రజల రక్షణ కోసం సిద్ధంగా ఉన్నారని, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకునే వారిని ఏమాత్రం ఉపేక్షించబోమని ఎస్పి తెలిపారు.



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
10 గురువారం 23-4-2026



## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో కఠిన చర్యలు

### ఇద్దరికి జైలు శిక్షలు -- మరికొందరికి రూ.10 వేల జరిమానా

**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, ఏప్రిల్ 22:** డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో నిందితులపై కోర్టు కఠిన చర్యలు తీసుకుంది. మిర్యాలగూడ రెండో అదనపు జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ అరుణ్ తేజ్ నిందితులకు రూ.10,000 జరిమానా లేదా జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ చల్ల శ్రీనివాస్ తెలిపారు.పిడుగురాళ్లకు చెందిన పేర్ల శ్రీనుకు మూడు రోజుల జైలు శిక్ష విధించగా, వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన మాలోతు మంగ్యాకు ఏడు రోజుల జైలు శిక్ష విధించినట్లు చెప్పారు.డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ట్రాఫిక్ పోలీసులు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నారని, మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్ఐ హెచ్చరించారు.

## డిమాండ్ల పరిష్కారానికి ఆర్టీసీ కార్మికుల సమ్మె

### మిర్యాలగూడలో 300 మంది సిబ్బంది నిరసన ్ బస్సులు డిపోకే పరిమితం ్ ప్రయాణికులకు ఇబ్బందులు



మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, ఏప్రిల్ 22: న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. బుధవారం మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్ వద్ద సుమారు 300 మంది డ్రైవర్లు, కండక్టర్లు మరియు ఇతర సిబ్బంది నిరసన కార్యక్రమం చేపట్టారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు.సమ్మె ప్రభావంతో మిర్యాలగూడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులు ఎక్కువగా డిపోకే పరిమితమయ్యాయి. దీంతో జిల్లా నలుమూలల నుంచి వ్యాపార, వాణిజ్య కేంద్రమైన మిర్యాలగూడ పట్టణానికి వచ్చి వెళ్లే వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అద్దె బస్సులు కొంతమేర మాత్రమే నడవడంతో ప్రయాణికుల కష్టాలు మరింత పెరిగాయి.అయితే మిర్యాలగూడ బస్ డిపో నుంచి సుమారు 13 ఎలక్ట్రిక్ బస్సులు మాత్రమే నడుస్తున్నాయి. సమ్మెలో సుమారు 300 మంది డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొనగా, 14 మంది సూపర్వైజర్లు మరియు సెక్యూరిటీ సిబ్బంది విధుల్లో ఉన్నారు.సమ్మె నేపథ్యంలో ఆర్టీసీ బస్టాండ్, డిపో పరిసరాల్లో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. టూ టౌన్ ఇన్స్పెక్టర్ జె. సోమనరసయ్య, రూరల్ సీఐ పీఎన్డి ప్రసాద్, ఒన్ టౌన్ ఇన్స్పెక్టర్ నాగభూషణరావు పర్యవేక్షణలో పోలీసులు భద్రత నిర్వహించారు.ఈ నిరసన కార్యక్రమంలో మిర్యాలగూడ డిపో జేఏసీ చైర్మన్ జి. శ్రీనివాస్, వైస్ చైర్మన్ బీవై కోటయ్య, కన్వీనర్ ఎం. సోమయ్య, కో-కన్వీనర్ బి. మహేంద్రరెడ్డి, కోశాధికారి బీసీ శేఖర్, కో-కన్వీనర్లు ఎం. సైదయ్య, బి. కృష్ణయ్యతో పాటు సభ్యులు సైదమ్మ, చంద్రకళ, ఆర్.జే. మెర్సీ, కడియం రమేష్, పాండురంగయ్య, అంజి, బాలసోమయ్య, వెంగలరెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా సాంబశివారెడ్డి జన్మదిన వేడుకలు

### ప్రగతి నగర్‌లో మజ్జిగ పంపిణీ!

**నిజాంపేట్, ఏప్రిల్ 22 (క్రైమ్ మిర్రర్):** బీఆర్ఎస్ నాయకుడు సాంబశివారెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా ప్రగతి నగర్‌లో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రగతి నగర్ 2వ వార్డు చందు లేఅవుట్‌లో వీఎస్ఆర్ కాలనీ వాసుల ఆధ్వర్యంలో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. ?ప్రస్తుతం వేసవి ఎండల తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా, స్థానిక ప్రజలకు, బాటసారులకు ఉపశమనం కలిగించేలా పార్టీ శ్రేణులు ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. సాంబశివారెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని నిర్వహించిన ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మరియు కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.



# ఘనంగా పోషణ్ పక్వాడ, అంగన్వాడీ ప్రీ-స్కూల్ గ్రాడ్యుయేషన్ వేడుకలు

### అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి: మున్సిపల్ చైర్ పర్సన్ వాణీ శ్రీనివాస్

### పిల్లలకు సెల్ ఫోన్లు ఇవ్వొద్దు.. ఆటలే ముఖ్యం: సీడీపీఓ మమత



**జగిత్యాల జిల్లా బ్యూరో(క్రైమ్ మిర్రర్):** ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని బీట్ బజార్ అంగన్వాడీ కేంద్రం ఆధ్వర్యంలో 8వ 'పోషణ్ పక్వాడ', 'ప్రీ-స్కూల్ గ్రాడ్యుయేషన్ డే' వేడుకలు స్థానిక సాయి పీఎంఆర్ రెసిడెన్షియల్ వద్ద ఘనంగా జరిగాయి. మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణీ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీడీపీఓ మమత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాలకు సిద్ధమైన 3 నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలకు వారి తల్లిదండ్రుల సమక్షంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి అభినందించారు.?కార్యక్రమంలో సీడీపీఓ మమత మాట్లాడుతూ.. పిల్లల శారీరక, మానసిక వికాసానికి సమతుల్య ఆహారంతో పాటు స్వేచ్ఛగా ఆడుకునే వాతావరణం ఎంతో అవసరమన్నారు. సెల్ ఫోన్ల వాడకం వల్ల పిల్లల్లో కంటి చూపు మందగించడం, నిద్రలేమి, ఆలోచనా శక్తి తగ్గడం వంటి తీవ్ర దుష్ప్రభావాలు కలుగుతాయని తల్లులను హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ వాణీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం అంగన్వాడీల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని, ఇతర సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వేడుకల్లో భాగంగా స్థానిక పెద్దల ఆశీస్సులతో గర్భిణీలకు శ్రీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలను కోలాహలంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ కె. అరుణ, ఏఎన్ఎం వజ్ర, ఆశా వర్కర్ నాగలక్ష్మి, రిసోర్స్ పర్సన్స్ జయశ్రీ, వాణి, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

# రావిర్యాలలో దద్దరిల్లిన హిందూ మహా సమ్మేళనం





### విశ్వం ఉన్నంత వరకు హిందూ సనాతన ధర్మం వికసిస్తుంది....!

### ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆదిత్య పరాశ్రీ స్వామీజీ

### స్వామీజీకి ఘన స్వాగతం పలికిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి యూత్ సభ్యులు



**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం నియోజకవర్గం రావిర్యాలలో ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం హిందూ మహా సమ్మేళనం అంగరంగ వైభవంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా, యువజన సంఘాలు,భజన మండలిలు,యువకులు మహిళలు,చిన్నలు పెద్దలు ,పెద్ద ఎత్తున పాల్గొన్నారు, సభ ప్రాంగణం కాషాయమయంగా మారింది స్వామీజీ శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయంలో శివలింగానికి పూజలు నిర్వహించి భక్తులకు అభివాదం చేసుకుంటూ సభా ప్రాంగణానికి చేసుకున్నారు. స్వామివారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ..ఆర్ ఎస్ ఎస్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హిందువులందరూ ఐక్యమత్యంగా ఉండే సమయం ఆసన్నమైందన్నారు..భారతదేశంలోని హిందువులకు హిందూ ధర్మం ఆత్మ అని దానిపై ప్రజలందరికీ అవగాహన కల్పించడంతోపాటు ఐక్యతను పెంపొందించడం కోసం హిందూ సమ్మేళనాన్ని నిర్వహించం గర్వంగా ఉందన్నారు. పార్టీలకు,కులాలకు అతితంగా హిందువులు అందరు కలిసి సభలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. గడప లోపలే మన కులం --- గడప దాటితే హిందువులం అనే నినాదం తొ ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు హిందూ సంప్రదాయాలు పాటించాలని మహిళలకు సూచించారు. ఎక్కడి నుండి వచ్చి మన హిందూ దేశంలో మనపైన పెత్తనం చేయడమేంటని ఆగ్రహించారు.ఒక్క సారి హిందువులంతా ఏకమై కన్నెర్ర చేస్తే కన్నీటిలో కొట్టుకుని పోవడం ఖాయమన్నారు.మన హిందూ దేశంలో పరాయి దేశస్తులను,ఇతర మతాలను గౌరవించడం హిందువుల యొక్క ఆత్మ గౌరవం అన్నారు.మన మతాన్ని ఆచరించండి..ఇతర మతాలను గౌరవించండని సూచించారు..కానీ మన హిందువుల జోలికి వస్తే,మన మతాన్ని కించపరిచే విధంగా మాట్లాడితే ఒక్కొక్కరు ఒక రాణి రుద్రమ దేవి కావాలి,ఒక జాన్సీ లక్ష్మీబాయి,ఒక కాళి మాతలాగా ఎదురు తిరగాలని మహిళలకు సూచించారు,అదేవిధంగా యువకులు ఒక్కొక్కరు అల్లూరి సీతారామరాజు,ఛత్రపతి శివాజీ,మహా కాళ రుద్రులై సంఘవిద్రోహశక్తులను చండ డాలని ఆదేశించారు.ఇకనైనా హిందూసోదరులు సోదరి మణులు మన హిందూ సనాతన ధర్మాన్ని ప్రపంచమంతా చాటిచెప్పాలని కోరారు.కార్యక్రమనికి గ్రామ నలుమూలల ఉన్న జన్నాయిగూడ,దేవేంద్రనగర్ కాలనీ,సర్దారనగర్, ఇతర గ్రామల నుండి హిందులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామంలోని 25 యువజన సంఘాలు వారి వారి ప్రత్యేక నృత్యాలతో, ఆట పాటల తొ మహిళలు బోనాలు, బతుకమ్మ లతో సభ ప్రాంగణానికి విచ్చేసారు.



## కొయ్యలగూడెం లో చేనేత ఆరోగ్య వైద్య శిబిరం

**చౌటుప్పల్, ఏప్రిల్ 22, క్రైమ్ మిర్రర్ :** చౌటుప్పల్ మండలం, కొయ్యలగూడెం,ఎల్లం బావి గ్రామాలలోని చేనేత కార్మికులకు, ప్రజలకు కొయ్యలగూడెం చేనేత సహకార సంఘ భవనంలో బుధవారం ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా చేనేత కార్మికులకు చేనేత ప్రజలకు ప్రత్యేక వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ కైరం కొండ స్వప్న అశోక్, ఎల్లం బావి గ్రామ సర్పంచ్ గంజి వనజలు ముఖ్యఅతిదులు గా పాల్గొని ప్రారంభించారు. చేనేత కార్మికులకు, ప్రజలకు వైద్య నిపుణులు ఉచిత కంటి పరీక్షలు, ఎముకల పరీక్షలు, రక్త పరీక్షలు వైద్య నిపుణులు పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేనేత కార్మికులు,చేనేత ప్రజలు ఆరోగ్య విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకొని సంతోషంగా జీవించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి సిహెచ్ కాటంరాజు, డిప్యూటీ డిహెచ్ఎంఓ డాక్టర్ సుమన్ కళ్యాణ్, కోయ్యలగూడెం గ్రామ సర్పంచ్ కైరం కొండ స్వప్న అశోక్, ఎల్లం బావి గ్రామ సర్పంచ్ గంజి వనజ, చేనేత సహకార సంఘం అధ్యక్షులు గడ్డం జయశంకర్, పొట్ట బత్తిని హరికృష్ణ, యజ్ఞ చారి, బాల మోహన్ రెడ్డి, చంద్రశేఖర్, వైద్య నిపుణులు డాక్టర్ రామకృష్ణ, ప్రజలు,సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ ఆర్టీసీ సమ్మెకు బీసీ రాజ్యాధికార సమితి మద్దతు

### ప్రభుత్వం వెంటనే చర్చలు ప్రారంభించాలి -- దాసు సురేశ్



**హైదరాబాద్ ఏప్రిల్ 22 క్రైమ్ మిర్రర్ ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న ఆర్టీసీ ఉద్యోగుల సమ్మెపై బీసీ రాజ్యాధికార సమితి తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ సమ్మెలో పాల్గొంటున్న ఉద్యోగులు మాత్రమే కాకుండా, ఆర్టీసీ సేవలను వినియోగించే ప్రయాణికులలో కూడా మెజారిటీగా బీసీ, దళిత వర్గాలే ఉన్నారని సమితి పేర్కొంది.ఈ నేపథ్యంలో, బీసీ రాజ్యాధికార సమితి ఆర్టీసీ సమ్మెకు పూర్తి మద్దతు ప్రకటిస్తూ, సమస్యను తక్షణమే పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేస్తూ ముఖ్యమంత్రికి బహిరంగ లేఖను పంపింది .బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్ మాట్లాడుతూ, సమ్మె దీర్ఘకాలం కొనసాగితే ప్రజలకు మాత్రమే కాకుండా ప్రభుత్వానికి కూడా తీవ్రమైన నష్టం కలుగుతుందని హెచ్చరించారు. అందువల్ల ప్రభుత్వం ఆలస్యం చేయకుండా వెంటనే చర్చలకు ఉపక్రమించి, కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను అంగీకరించాలని కోరారు.ప్రజా రవాణా వ్యవస్థకు మూలస్థంభమైన ఆర్టీసీని బలహీనపరచడం వల్ల సామాన్య ప్రజల జీవన విధానంపై తీవ్ర ప్రభావం పడుతుందని, అదే సమయంలో కార్మికుల హక్కులను నిర్లక్ష్యం చేయడం కూడా సరికాదని ఆయన పేర్కొన్నారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి దాసు సురేశ్ కింది డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కోరారు:

- ఆర్టీసీ ఉద్యోగులతో వెంటనే చర్చలు ప్రారంభించి సమ్మెను శాంతియుతంగా పరిష్కరించాలి
- ఆర్టీసీ సంస్థను బలోపేతం చేసే విధంగా ప్రభుత్వంలో విలీనం చేసే అంశాన్ని పరిగణించాలి
- పెండింగ్ వేతనాలు, పీఆర్సీ, భత్యాలను తక్షణమే చెల్లించాలి
- కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ రెగ్యులరైజేషన్ చేపట్టాలి
- ప్రైవేటీకరణ చర్యలను పూర్తిగా నిలిపివేయాలి
- ప్రజా ప్రయోజనాలు మరియు కార్మిక హక్కులు ప్రభుత్వానికి సమాన ప్రాధాన్యత కలిగినవన్నారు . ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, ఉద్యోగుల హక్కులను కాపాడే సమతుల్య పరిష్కారం కనుగొనడం ప్రభుత్వ బాధ్యత అని దాసు సురేశ్ పేర్కొన్నారు.సమ్మెను బలహీనపరచడం కాకుండా , చర్చల ద్వారానే సమస్యకు పరిష్కారం కనుగొనాలని ఆయన హితవు పలికారు.ప్రభుత్వం ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే, బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగుల పక్షాన సమ్మెకు మద్దతుగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని తెలియజేశారు .

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.